

18 వ వసంతంలోకి


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గ్రేటర్ హైదరాబాద్





ఆదివారం 2 ఫిబ్రవరి 2025 పేజీలు 10


## ప్రపంచ పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్



మాదాపూర్,మేజర్ న్యూస్ : ప్రపంచం పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధి చెందుతున్నదని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతోందని, ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయలు, అభివృద్ధి ప్రాజెక్టులతో నగరం పెట్టుబడులను ఆకర్షిస్తోందన్నారు. హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల వరకు శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ, ప్రపంచ స్థాయి స్కిల్, స్పోర్ట్స్ వర్సిటీలు వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్ ప్రపంచ పెట్టుబడి కేంద్రంగా మారుతుందని, దావోస‌లో రూ. 1.78లక్షల కోట్ల పెట్టుబడులు సేకరించడం వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేయడానికి, రియల్ ఎస్టేట్ వృద్ధిని ప్రోత్సహించడానికి దోహదపడుతుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం, నిర్మాణ రంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ.. భూ భారతితో రెవెన్యూ సమస్యలు తీరతాయన్నారు. రియల్టర్లు ఎదుర్కొంటున్న సందేహాలను నివృత్తి చేశారు. సీఎం ఓఎస్డీ వి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఫ్రీలాంచ్ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు విజయసాయి మేక, ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్‌రెడ్డి, ప్రముఖ నటుడు మురళీమోహన్, డెవలపర్లు పాల్గొన్నారు.

# ఫిల్లింగ్ టైమ్ తగ్గితే.. మెరుగైన సేవలు

## అయ్యప్ప సొసైటీ ఫిల్లింగ్ స్టేషన్‌ను సందర్శించిన ఎండీ అశోక్ రెడ్డి



హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి) మాదాపూర్ లోని అయ్యప్ప సొసైటీలోని ఫిల్లింగ్ స్టేషన్ ను ఎండీ అశోక్ రెడ్డి సందర్శించారు. గత కొన్ని రోజులుగా ట్యాంకర్ బుకింగ్స్ పెరగడంతో, ట్యాంకర్ బుకింగ్స్, డెలివరీ మీద దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఎండీ ఈ ఫిల్లింగ్ స్టేషన్ కు వచ్చారు. మొదటగా ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ట్యాంకర్ ఫిల్లింగ్, టోకెన్ జనరేషన్ వివరాలు తనిఖీ చేశారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న 3 ఫిల్లింగ్ స్టేషన్లతో మరో 3 ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డిమాండ్ ను బట్టి ట్యాంకర్ల సంఖ్యను సైతం పెంచుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. గతేడాది లాగే భూగర్భ జలాలు అడుగంటడంతో ట్యాంకర్ పెరిగే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఒక ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ లోపలికి వచ్చి.. నీటిని నింపుకొని బయటికి వెళ్లేందుకు దాదాపు 8–10 నిమిషాలు పడుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఈ సమయాన్ని 5 నిమిషాలకు తగ్గిస్తే ఒకరోజులో రెట్టింపు ట్రిప్పులను డెలివరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమయాన్నే తగ్గించుకోవడానికి అన్ని ఫిల్లింగ్ స్టేషన్ల పరిసరాల్లో పలు మార్పులు చేర్పులు చేయాలని సూచించారు.

ట్యాంకర్ వచ్చి వెళ్లడానికి మంచి అంతర్గత రోడ్లను నిర్మించుకోవాలని, ఫిల్లింగ్ బే (ట్యాంకర్లలో నీరు నింపే ప్రాంతం) సరైన విధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఎక్కువ ట్యాంకర్లు బుక్ అయ్యే ఫిల్లింగ్ స్టేషన్ లో అదనపు ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. మిగతా 2లో

### సదరం సర్టిఫికెట్‌కు అవకాశం..

# సద్వినియోగం చేసుకోండి

## ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్



సీతాఫలమండి, మేజర్ న్యూస్: దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ పొందడం కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు దరకాస్తుకు మీ సేవా కేంద్రాల్లో అవకాశం ఉందని శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ తెలిపారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారికి వారు పరీక్ష చేసుకోవాల్సిన ఆసుపత్రి వివరాలతో స్లాట్ (తేదీ, సమయం) కేటాయించడం జరుగుతుంది. వికలాంగుల పించన్లు, ఇతరత్రా సదుపాయాలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరింత సమాచారం కోసం సీతాఫలమండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని పద్మారావు గౌడ సూచించారు.

# తీర్థ గోష్ఠి నూతన శిఖర ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

### కుంభాభిషేకం పూజలు నిర్వహించిన త్రిదండి చిన్న జీయర్ స్వామి

కాప్రా,మేజర్ న్యూస్ : మీర్ పేట్ హెచ్ బికాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారి సన్నిధిలో తీర్థ గోష్టి నూతన శిఖర ప్రతిష్ట (సుదర్శన చక్రం)కుంభాభిషేకం పూజ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి,స్థానిక కార్పోరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ లు పాల్గోన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి,ఆలయ ఈవో రవీందర్ రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు,భక్తులు పాల్గోన్నారు.



## ట్యాక్స్‌లు కట్టని వ్యాపార సముదాయాలకు తాళాలు ..




హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : అంబర్పేట్ సర్కిల్– 16, నారాయణగూడ లోని దీపక్ థియేటర్ పక్కన ఉన్న లోటస్ బాయ్స్, గర్ల్స్ హాస్టల్, ఇండియన్ దర్బార్ హొటల్ కు జిహెచ్ఎంసి అధికారులు శనివారం తాళాలు వేశారు. ఏ ఎమ్ ఓ హెచ్ డాక్టర్ హేమలత, శానిటరీ సూపర్వైజర్ తిరుపతి నాయకులు అనుమానంతో వ్యాపారుల ట్యాక్స్ ల వివరాలను పరిశీలించారు. గత మూడు సంవత్సరాలుగా రెండు హాస్టల్స్, ఓనరు దాదాపు రూ 3 లక్షల 30 వేల ప్రాపర్టీ టాక్స్ చెల్లించకుండా నడుపుతున్నట్లుగా గుర్తించారు. హొటల్ యజమాని రూ.31 వేల ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించకుండా వ్యాపారం కొనసాగిస్తుండడంతో తాళాలు వేశారు. వెంటనే అప్రమత్తమైన యజమానులు సాయంత్రం లోపు పన్నులు చెల్లించి ఓపెన్ చేసుకున్నారు. కనుక వ్యాపారులు ప్రాపర్టీ టాక్స్ , ట్రేడ్ లైసెన్సుల ఫీజులు చెల్లించాలని డాక్టర్ హేమలత తెలిపారు. లేకుంటే ఎంతటి వారినైనా వదిలి పెట్టమని, వారి వ్యాపార సముదాయాలకు తాళాలు వేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. వ్యాపారులు జిహెచ్ఎంసి నిబంధనలకు లోబడి తమ వ్యాపారాలను చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిహెచ్ సోమయ్య పాల్గొన్నారు.

# మోడ్రన్ కార్పొరేషన్‌గా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పని చేశాం : కోలన్ నీలా గోపాల్ రెడ్డి



నిజాంపేట్ మేజర్ న్యూస్ : మొదటి నుండి మోడ్రన్ కార్పొరేషన్ గా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పని చేశామని అందుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, స్థానిక డివిజన్ నాయకులకు ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు కోలన్ నీలా గోపాల్ రెడ్డి. శనివారం తొలి మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డిలని వారి నివాసం వద్ద 12వ డివిజన్ సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, సుబ్బారెడ్డి ఆద్వర్యంలో ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2, ఏ.ఎస్ రాజు నగర్, ఫేస్ 3 ప్రెసిడెంట్ సి హెచ్ మహేష్ ఆద్వర్యంలో ఇందిరమ్మ కాలనీ ఫేస్ 3 నాయకులు, అడ్వకేట్ నరసింహ రెడ్డి, శివాలయం సాయినాథ్ నగర్ కాలనీ నాయకులు, స్థానిక డివిజన్ ఆయా కాలనీ వాసులు కలిసి వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి, వారిచే కేక్ కట్ చేయించి అభినందనలు తెలియజేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా కార్పొరేషన్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన కోలన్ నీలా గోపాల్ రెడ్డి పదవీ కాలం విజయవంతంగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా తొలి మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రత్యేకంగా 12వ డివిజన్ పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అదే విధంగా తమకు ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించిన 12వ డివిజన్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ఎల్లపుడూ ప్రజలలో ఉంటూ ఎప్పటికప్పుడు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## కమిషనర్‌ను సన్మానించిన మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు పసుపులేటి వీరభాస్కర్‌రావు





జవహర్ నగర్, మేజర్‌న్యూస్ః జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ వసంతను శనివారం జవహర్ నగర్ మున్నురు కాపు సంఘం అధ్యక్షులు పసుపులేటి వీరభాస్కర్‌రావు ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పోరేషన్ కార్యలయంలో కలిసి శాలువ కప్పి సన్మానించారు. మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మొగిలిపాక వెంకటేష్, నర్శింహ, యాదగిరి, శ్రీను, సుదర్శన్‌యాదవ్, రమేష్, సత్తయ్య, దేవేందర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## పార్టీలకు కార్యకర్తలే పెద్ద ఆస్తి

### – బాబా సతమణి హబీబా సుల్తాన





ఎర్రగడ్డ..మేజర్ న్యూస్.. జెండాలు చేత భూని ఎల్లప్పుడు నాయకులకు తోడుగా ఉంటున్న కార్యకర్తలే పార్టీలకు పెద్ద ఆస్తి అని నగర మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరటేర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తాన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని సైట్–3కి చెందిన కాంగ్రేస్ నాయకులు రవి నాయుడు తండ్రి వెంకటేష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో భాదపడుతున్నాడన్న సమాచారం అందడంతో హబీబా సుల్తాన శనివారం నాయుడు ఇంటికి వెళ్ళి వెంకటేష్‌ను పరమార్శించి వెంకటేష్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా సుల్తాన మాట్లాడుతూ తోడుగా ఉంటు మన కోసం సమయం కేటాయిస్తున్న నాయకులు, కార్యకర్తలు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో మనమూ వారికి అండగా నిలువాలన్న బాబా సూచనల మేరకు నేడు ఇక్కడికి వచ్చి రవి నాయుడుకి ధైర్యం కల్పించడం జరిగిందని సుల్తాన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## సూర్య దిన పత్రిక క్యాలండర్‌ను ఆవిష్కరించిన షేక్‌పేట్ మండల తహసీల్దార్ వై. అనితారెడ్డి



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః"సూర్య" దిన పత్రిక నూతన సంవత్సర క్యాలండర్‌ను షేక్‌పేట్ మండల తహసిల్దార్ వై. అనితారెడ్డి ప్రత్యేకంగా మండల డిప్యూటీ తహసిల్దార్లు ఉబ్బు రమేష్, శంకర్,సీనియర్ అసిస్టెంట్ అనిరుధ్,ఆర్.ఐ. భాను, వి.ఆర్.ఓ.లు చింతల మురళి, భోగి నాగరాజ్‌లతోకల్సి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వై. అనితారెడ్డి మాట్లాడుతూ ఏడాదికి సంబంధించిన భవిష్యత్ కార్యక్రమాలు,శుభ కార్యాలు,రోజువారికి సంబంధించిన అన్ని విషయాలు క్యాలండర్‌ద్వారా అన్ని విషయాలను తెలుసుకోడానికి దిక్సూచీగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

## రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం క్యాలండర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గ డ్డం ప్రసాద్‌కుమార్



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన సంవత్సరం క్యాలండర్‌ను శనివారం బంజారహిల్స్ రోడ్ నెం.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేకంగా రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్ నాయీతోకల్సి లాంఛనంగా క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం తరపున రూపొందించిన నూతన సంవత్సరం క్యాలండర్ నాయీ బ్రాహ్మణుల్లో మరింత ఐకమత్యాన్ని పెంపొందించడమేగాక, సంఘంలో పరిచయాలు పెంచేందుకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. ప్రారంభంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్ నాయీ ప్రత్యేకంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం ఆర్గ్నైజింగ్ సెక్రెటరి రమేష్ కోడిచెర్ల,ఇందిరానగర్ సంఘం ఉపాధ్యక్షులు సింగిడాల రూపేష్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిల్లింగ్ టైమ్ తగ్గితే.. మెరుగైన సేవలు



**మొదటిపేజీ తరువాయి...**

పగటి సమయంలో గృహ వినియోగదారులకు, రాత్రి వేళల్లో హాస్టళ్లు, హెూటళ్ల వంటి వాణిజ్య వినియోగదారులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. దీని వల్ల వెయిటింగ్ పిరియడ్, పెండెన్సీ తగ్గించవచ్చన్నారు. ట్యాంకర్ బుకింగ్ లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎండీ హెచ్చరించారు. ప్రతి ట్యాంకర్ టోకెన్ పై బార్ కోడ్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. దీని వల్ల ప్రతి ట్రిప్పుల లెక్కలు పక్కాగా ఉంటాయన్నారు. మరుగుదొడ్లు, వెయిటింగ్ రూమ్ లు లేని ఫిల్లింగ్ స్టేషన్లలో వాటిని ఏర్పాటు చేయాలని చెప్పారు. రాత్రి సమయంలో లైటింగ్ సరిగ్గా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఫిల్లింగ్ స్టేషన్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎండీ తెలిపారు. ఇవి ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయానికి అనుసంధానమై ఉంటాయన్నారు. దీని వల్ల ప్రతి కదలికను పర్యవేక్షిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం బ్రిజేష్, డీజీఎం, మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు నివారణ పక్షం జనవరి 30నుంచి ఫిబ్రవరి,13వరకు స్పర్శ్ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః కోఠిలోని ప్రజా ఆరోగ్య ,కుటుంబ సంక్షేమ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కుష్టు వ్యాధి పక్ష జనవరి,30వ తేదినుంచి ఫిబ్రవరి,13వ తేదిరవకు స్పర్శ్ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని జాయింట్ డైరెక్టర్ అండ్ స్టేట్ లెప్రొాబసి ఆఫీసర్ డా. డా. డి. జాన్ బాబు తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ మాటల్లో కుష్టు వ్యాధి వైద్యపరమైన సమస్యల మాత్రమే కాదని, ఇది సమాజీక పరమైన సమస్యఅని, చైతన్యమైన సమాజంలో కుష్టు నిర్మూలన సాధ్యం అంటూ ప్రజలందరు వివక్షను విడనాడి కుష్టు వ్యాధి నిర్మూలనా ఉధ్యమలో పాల్గొన్ననాగే వ్యాధి పీడితులకు సముచితమైన స్థానంను కల్పించినపుడే ఈ వ్యాధిని మన సమాజంనుంచి దూరం చేయవచ్చున్నారు. తానే స్వయంగా వ్యాధిగ్రస్తులను ఆక్కున చేర్చుకుని సేవలందించారని, ఈ మాటలను చేతలను ఆదర్శంగా తీసుకుని ప్రతి సంవత్సరం గాంధీ వర్థంతి రోజున కుష్టు వ్యతిరేక దినంగాను జనవరి,30వ తేదినుంచి ఫిబ్రవరి13వ తేదిరకు కుష్టు వ్యతిరేక (నిరాకరణ ) పక్షంగాను మనం పాటించడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియాను వేదికగా తీసుకుని ప్రచార కార్యక్రమాలు జరిపేందుకు మనం ముందుకు సాగుతున్నామన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను కునుగొని వారికి ఉచిత బహుళ ఔషధ చికిత్స అందజేయడం,వ్యాధిగ్రస్తుల్లో అంగ వైకల్య నిర్మూలన,–పునరావాసంకోసం వైద్యపరమైన చర్యలు చేపట్టడం,అందుబాటులో ఉన్న మానవ వనరుల్లో శిక్షణ ద్వారా నైపుణ్యత పెంచుట,సరియైన సమాచారం,ఆరోగ్య, విద్యా, విజ్ఞానంద్వారా పెద్ద ఏత్తున ప్రచారంద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంవల్ల పురోగతిని సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో హిందూ కుష్ట నివారన్ సంఘ సెక్రెటరి డా. జి.డి. నాయుడు,వనిత పారా మెడికల్ ఆఫీసర్ డా. ప్రదీప్‌కుమార్, ఫిజియో థెరపిస్ట్ పార్థ సారథి, డిప్యూట ఈపార మెడికల్ ఆఫీసర్స్ రాధాకిషన్, జి.వి. రమణ, అనిత, రమేష్ నాయక్,సకలారెడ్డి, లింగ్యా నాయక్,దేవిసింగ్,జ్యోతిబాయి, ధరణికుమార్,రవీందర్‌రెడ్డి, జాఫర్, నరసింహారెడ్డి, లవణం తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాసులు,రాష్ట్ర కార్యదర్శి ఎస్. సునీల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిగ్రస్తులను ఆక్కున చేర్చుకుంటామని,కుష్టు వ్యాధిని అంత మొందిస్తామంటూ ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేశారు.

## పోలీసు స్టేషన్‌కు చేరిన బాలుడు



జవహర్ నగర్ , మేజర్‌న్యూస్ః తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన మూడు ఏళ్ల బాలుడు జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చేరాడు. దమ్మాయిగుడలోని రోడ్ మీద రోదిస్తూ అటూ ఇటూ తిరుగుతున్న బాలుడిని చూసిన స్థానికులు జవహర్ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి బాలుడిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. తన పేరు శామ్యూల్ డాడి పేరు యాకూబ్, మమ్మి పేరు పార్వతి అని చెబుతున్నాడు. బాలుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు 8712580147, 87166218 8లలో సంప్రదించాలని సూచించారు.

## వరంగల్ బిసి గర్జనకు తరలిరండి : కౌలె జగన్నాదం



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃబడుగు, బలహీనవర్గాల హక్కుల సాధన కోసం ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం వరంగల్ ఆర్ట్స్ కళాశాల దగ్గర జరుగనున్న బిసిల గర్జన సభకు విశ్వకర్మలు తరలి రావాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలె జగన్నాదం పిలుపునిచ్చారు. విశ్వకర్మల సమస్యల పరిష్కారం కోసం శనివారం ఎమ్మెల్సీ మల్లన్నను కలిసి వినతి సమర్పించామని సానకూలంగా స్పందించిన మల్లన్న ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఏది ఏమైనా బడుగుల అభ్యున్నతి కోసం జరిగే బిసి గర్జనకు మన వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని అందుకోసం నేడు జరిగే బిసి గర్జనకు విశ్వకర్మలు హాజరై జయప్రదం చేయాలని బిఎన్‌రెడ్డినగర్ సాగర్ కాంప్లెక్స్‌లోని మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జగన్నాదం కోరారు. ఈ సమావేశంలో సలహాదారులు తల్లోజు బ్రహ్మాచారి, రాష్ట్ర కార్యదర్శి కోటి జలంధరాచారిలు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉపనయనములు

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃబ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ వనస్థలిపురం వారి ఆధ్వర్యంలో ఈనెల 23 వ తేదీ ఉదయం 10. 30 గంటలకు అర్హులైన బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉపనయన సాంస్కారము జరుపబడుతుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోచంపల్లి శ్రీధర్‌రావు, నందిరాజు లక్ష్మినారాయణలు తెలియజేశారు. ఉపనయనములు వనస్థలిపురం గరుద్వారా రోడ్డులోని రామాలయంలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు జరుగుతాయని, అన్ని వేదముల బ్రాహ్మణ వటువులు ఈ కార్యక్రమంలో 20వ తారీఖు లోపల తమ పేర్లను గాయత్రి భవన్‌లో నమోదు చేసుకోవాలని అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చింతపల్లి మంగపతి రావు కోరారు. పూర్తి వివరాలకు సంఘటన కార్యదర్శి పోగుల రాంబాబును ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుండి గాయత్రి భవనంలో సంప్రదించవచ్చని, 6302454218 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని వారు తెలిపారు.

## వివేకానంద నగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పిల్లి నాగమణి నియామకం



కూకట్ పల్లి మేజర్ న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యురాలిగా నారంగ్ షాలిని జీతేందర్, వివేకానంద నగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పిల్లి నాగమణి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగలి సునీత రావు ,రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి ప్రణవ్ గౌడ్ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ గౌడ్ లు గాంధీభవన్ లో నియామక పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు విద్యకల్పన ఏకాంత్ గౌడ్, శేరిలింగంపల్లి నియోజకవర్గం బి బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీదేవి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు స్వప్న గౌడ్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ శ్రీనివాసం...



ముషీరాబాద్ / రవీంద్ర భారతి మేజర్ న్యూస్ : భారతీయ కళలను పరిరక్షించుకొని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిటిడి మాజీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎల్వి సుబ్రహ్మణ్యం అన్నారు. గ్లోబల్ ఇల్యూమిని, తెలంగాణ భాషా సాంస్క శాఖ సంయుక్త ఆధ్వ ర్యంలో ప్రముఖ నాట్య గురువు డాక్టర్ యశోద ఠాకోర్ బృందంచే కళ్యాణ శ్రీని వాసం నృత్య రూపక ప్రదర్శన రవీంద్ర భారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్వి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ ఎం రామచంద్ర రావు, సీనియర్ సంపాదకులు ఎంవిఆర్ శాస్త్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి విశిష్టత తెలియడానికి కళ్యాణం శ్రీనివాసం నృత్య రూపక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తే కళాకారులు అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. మనిషి ఆరోగ్య జీవనానికి నాట్య కళలు దోహదపడతాయన్నారు. అనంతరం అత్యంత సుందరంగా రూపొందించిన జగన్నాథుడు శ్రీనివాసుడు, జగన్నాయకి పద్మావతి లీలా కళ్యాణంప్రదర్శించిన కళ్యాణ శ్రీనివాసం రూపక ప్రదర్శన ఆకట్టుకుంది.

# ఘనంగా ఎరుకల అంజయ్య గౌడ్ జన్మదిన వేడుకలు

### అంబర్‌పేట్ వాకింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో బర్త్‌డే విషెస్



హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి): అంబర్పేట్ సిపిఎల్ గ్రౌండ్లో ని వెంకటేశ్వర టెంపుల్ లో శనివారం రోజు ఎరుకల అంజయ్య గౌడ్ పుట్టినరోజును అంబర్పేట్ వాకింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఘనంగా పుట్టినరోజు



వేడుకలు జరిగాయి ఈ సందర్భంగా మిత్రులందరికీ శాలువా కప్పి సన్మానం చేసి మిఠాయిలు పంచారు. అనంతరం అంజయ్య గౌడ్ తన పుట్టినరోజును గుర్తుచేసుకొని శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో భగవంతుని సన్నిధానంలో నా పుట్టినరోజును జరిపినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం దేవరుప్పుల ఆంజనేయులు పద్మ పాండురంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఇందులో పాల్గొన్న మిత్రులు దేవరుప్పుల కుమార్, పయ్యావుల సత్తయ్య, దేవరుప్పుల విజయ్ కుమార్, పూజారి సోమయ్య గౌడ్,దేవరుప్పుల బాలకృష్ణ, నక్క రమేష్, దొడ్డ వెంకటేశ్వర్లు,, ఆర్టీసీ రాములు,, మల్లేష్ గౌడ్ హంశారామ్, తండు అంజయ్య గౌడ్ మనోజ్ యాదవ్ పాల్గొన్నారు.

## పేదల వ్యతిరేక బడ్జెట్ : సిపియం

### ఎల్బీనగర్‌లో నిరసన దిష్టిబొమ్మ దహనం



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃకేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్ పేదలు, మధ్య తరగతి ప్రజల వ్యతిరేకమైన బడ్జెట్ అని, కార్పోరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా ఉందని సిపియం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తు సిపియం పార్టీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లో నిరసన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టే విధంగా ఉందన్నారు. భారతీయులకు ఉపయోగపడే విధంగా ఈ బడ్జెట్ లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను సవరించి ప్రజా ప్రయోజనాకరిగా ఉండే బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశ పెట్టాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించకతప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం చంద్రమోహన్, జగదీష్, జగన్, ఈ నరసింహ, సిపియం జిల్లా కమిటి సభ్యులు కీసరి నర్సిరెడ్డి, సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, ఐద్వా నాయకురాలు సంధ్య, కమర్, నాయకులు రవీందర్, మంతెన యాదయ్య, దుర్గారావు, వీరయ్య, శ్రీనివాస్, చైతన్య, డి రాధ, కాశయ్య, మూర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన హైదరాబాద్ సిటీ పోలీస్ హాకీ జట్టు




అమీర్ పేట,మేజర్ న్యూస్: కరీంనగర్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీలు - 2025లో హైదరాబాద్ సిటీ పోలీస్ హాకీ జట్టు సత్తా చాటింది.హ్యాట్రిక్ విజయాలను సాధించి ట్రోఫీని గెలుచుకుంది.శనివారం జరిగిన పోలీస్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ట్రోఫీని అందుకుంది.ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ 2014, 2017 సంవత్సరాల్లో జరిగిన పోటీల్లో కూడా హైదరాబాద్ సిటీ పోలీస్ విజయాలను సాధించిందన్నారు.జట్టు సభ్యులు సమన్వయంతో,పరస్పర సహకారంతో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు,వారందరికీ శుభాకాంక్షలను తెలియజేశారు. టీఎస్పీ,వరంగల్,నల్గొండ,జట్టులతో హైదరాబాద్ సిటీ పోలీస్ జట్టు తలపడిందని వారు తెలియజేశారు.ఇదే విధంగా క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు.

## ఇది నిజంగా జనరంజక బడ్జెట్

### కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్



మల్కాజిగిరి ,మేజర్ న్యూస్: ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో వికసిత భారత్ లక్ష్యం గా దూసుకుపోతున్న ఈ తరుణంలో శనివా రం ఆర్థిక శాఖమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన 2025- 2026 ఆర్థికబడ్జెట్ పేద,మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరటని చ్చిందని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. పేదలు, రైతులు, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉండేలా బడ్జెట్ రూపొం దించారని, అన్ని వర్గాలు ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. భారతదేశంలో ఎక్కువ శాతం ఉన్న పేద,మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన బడ్జెట్ అని కొనియాడారు. ఇది నిజంగా ఆయా వర్గాల వారికి శుభవార్త అన్నారు. 12 లక్షల వరకు ఆదాయపన్ను లేకపోవడంతో మధ్య తరగతి ప్రజలు ఎన లేని సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు. యువతకు ఉద్యోగ కల్పన కోసం ,సంక్షేమ పథకాల కోసం బడ్జెట్ కేటాయింపు లు చేయడం అన్ని వర్గాల అభివృద్ధి కోసమే నని, జనరంజక బడ్జెట్ ను ప్రవేశ పెట్టిన ఆర్థిక శాఖమంత్రి నిర్మల సీతారామన్ కు ఈ సంద ర్భంగా కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

### పార్టీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుంది : వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్ పల్లి,మేజర్ న్యూస్ : వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు సి.హెచ్ నర్సింగ్ రావు, శ్రీలత ఇటీవల భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు వారిరువురిని సన్మానించి పార్టీలోకి ఆహ్వానిస్తూ అభినందించారు. పార్టీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందని పార్టీని మరింత పటిష్టం చేసి, అధికారంలోకి వచ్చే విధంగా అందరం సమిష్టిగా పనిచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు డాక్కయ్య, పిట్ల మనోహర్, రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకులు నాగరాజు, సుదర్శన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా.. చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి



కూకట్ పల్లి మేజర్ న్యూస్ :శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ లో శుక్రవారం జరుగబోయే సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్ ఒకటి (1) పులి గుర్తుపై ఓటు వేయాలని ఇంటి ఇంటి ప్రచార కార్యక్రమములో పాల్గొన్నారు. పాపిరెడ్డి నగర్ కు చెందిన అన్ని పార్టీలకు సంబంధించిన నేతలు మహా కూటమిగా ఏర్పడి గత మాజీ అధ్యక్షుడు గత కొన్ని సంవత్సరాలుగా కాలనీ పై దాదాపుగా 30 లక్షలకు పైగా డబ్బులు వసూళ్లు చేసి సొసైటీ లో ఒక్క రూపాయి కూడా లేకుండా దోపిడి జరిగిందన్నారు. ఇలాంటి వ్యక్తి దోపిడీని ఆపాలంటే ఈ మాజీ అధ్యక్షుడిని మరో సారి గెలవకుండా ఓడించడం ఒక్కటే మార్గమని పలువురు నేతలు పేర్కొన్నారు. చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించి దోపిడి రాజ్యానికి అడ్డు కట్ట వేయాలని కేశిరెడ్డి హన్మంతు రెడ్డి, ఏసీరెడ్డి భూపాల్ రెడ్డి, చర్ల రామకృష్ణ రెడ్డి,మాయ రాజయ్య పర్వతాలు యాదవ్,లక్ష్మమ్మ యాదవ్, టీ వీ పద్మ, కరుణ శ్రీ,పద్మ పలువురు నాయకులు పెద్దలు అన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వాటర్ ప్లాంటు ఆధ్యుడే మాజీ అధ్యక్షుడు అని అన్నారు.అతను నెల నెలా వాటర్ ప్లాంటు నిర్వాహకుల వద్ద డబ్బులు తీసుకునే వాడని, ప్లాంట్ పెట్టుకోవాడానికి లెటరు ప్యాడ్ కూడా వ్రాసి ఇచ్చారని అన్నారు. సదరు వాటర్ ప్లాంటు నిర్వాహకులు బస్తీలో ప్రతీ ఇంటికి కర పత్రాలు కూడా పంచడం కూడా జరిగిందన్నారు. ఈ మాజీ కడిగిన ఆణిముత్యం ఐతే ఎందుకు నిరూపించుకోలేకపోయాడు ఎద్దేవ చేశారు. ఈ మాజికి చెప్పుకోవడానికి ఏమీ లేక ఈ రకంగా బస్తి వాసులను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడు అని అన్నారు. కానీ కాలనీలో ఇప్పు ఇతనిని నమ్మడానికి ఎవరు లేరని శ్రీధర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ సీనియర్ నాయకులు గడ్డం రాజేశ్వర్ రెడ్డి, దొడ్ల రామి రెడ్డి, సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, ఈరెడ్డి దేవేందర్ రెడ్డి, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, మాయ బాల నరసయ్య, ఎడ్ల సంపత్ రెడ్డి, తడికల రాజీ రెడ్డి, వావిళ్ళ బుగ్గయ్య, డాకురి అక్కిరెడ్డి, చర్ల సత్యనారాయణ రెడ్డి, మల్లేశ్ యాదవ్, శ్రీ కాంత్, రాజనర్సింహ రెడ్డి, శరత్ రెడ్డి, వీరన్న, రొండ్ల రవీందర్ రెడ్డి, సునీల్, సాయి బాబా, వెంకటేశ్వర రెడ్డి, రమేష్ గుప్త, దొడ్ల సాయి రెడ్డి, మోహన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, స్వామి, రాజిరెడ్డి, యాదగిరి వడ్డెర, రో0డ్ల మహేందర్ రెడ్డి, మల్లికార్జున్, వెంకట్ రెడ్డి, లక్ష్మణ్ మెస్త్రీ, జైపాల్ రెడ్డి, ఇంద్ర సేనా రెడ్డి, రాములు, మల్లారెడ్డి, భాస్కర్, పాండు, శ్రీనివాస్ రెడ్డి, వినోద్, కర్నాకర్ రెడ్డి, వెంకటేష్, స్వామి, నాగరాజు, రవి, శేఖర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, నర్సింహులు, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రవి, సుదర్శన్, రాజేందర్, భూ లక్ష్మి, మంజుల, కృష్ణా రెడ్డి, బుచ్చి రెడ్డి, భాస్కర్, ప్రకాష్, శివ గుప్త, సోమి రెడ్డి, రాజు ఇతర కాలనీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ మల్లన్నను మర్యాద పూర్వకంగా కలిసిన విశ్వకర్మ నాయకులు

▶▶ విశ్వకర్మల సమస్యలను వివరించిన కౌలె జగన్నాధం

▶▶ శాలువాతో సత్కరించి మెమొంటో అందజేసిన విశ్వకర్మలు



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃఅఖిల భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలె జగన్నాదం ఆధ్వర్యంలో విశ్వకర్మ నాయకులు శనివారం ఎమ్మెల్సీ మల్లన్నను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలె జగన్నాదం విశ్వకర్మల సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని కోరుతు వినతి ప్రతం అందజేశారు. సమాజానికి అన్ని విధాలుగా పరోక్ష సహాయ సహకారాలు అందజేస్తున్న 50 సంవత్సరాలు దాటిన విశ్వకర్మలకు 5 వేల రూపాయల ఫించన్ అందజేయాలని, తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని, విశ్వ బ్రాహ్మణ కార్పోరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ పదవి కులస్తులకే ఇవ్వాలని, ఉప్పల్ భగాయత్ లోని 5 ఎకరాలలో 2 వందల కోట్లతో ఆత్మ గౌరవ బిల్డింగ్ కట్టించి ఇవ్వాలని తదితర సమస్యలను మల్లన్నకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామాలలో ఉన్న కట్టె కోత మిషన్‌లో వారికి పర్మిషన్ల వారికి అనుమతులు ఇవ్వాలని, దుగోడ మిషన్ లకు ఉచిత కరెంటు ఇవ్వాలని కోరుతు సామాజికంగా వెనుకబడ్డ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా కౌలె జగన్నాదం కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ మల్లన్న ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జగన్నాదం తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విశ్వకర్మ మహాసభ కోశాదికారి ఆవంచ మురళి, ఉపాధ్యక్షులు కాసోజు శ్రీనివాసచారి, సలహాదారులు కనపర్తి లక్ష్మణాచారి, మడుపోజు లక్ష్మినారాయణ, సలహాదారులు అక్కెనపల్లి లక్ష్మణాచారి, మహిళా కార్యదర్శి జయశ్రీ, యూత్ అధ్యక్షులు కౌలె అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


▶▶ దమ్మోహన్ సింగ్ గిరిధర్ రావుల అధ్యక్షతన సమావేశం

▶▶ 45 సంవత్సరాల తరువాత హెూటల్ ప్లాజాలో పూర్వ విద్యార్థుల సమావేశం



హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి): 45 సంవత్సరాల తర్వాత బేగంపేట హెూటల్ ప్లాజాలో ధన్మోహన్ సింగ్, గిరిధర్ రావు అధ్యక్షతన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది, ఈ ఆత్మీయ సమ్మేళనానికి 26 మంది పూర్వ విద్యార్థులు (సభ్యులు ) హాజరయ్యారు, ఈ కార్యక్రమం ప్లాజా హెూటల్ హాల్లో చక్కగా ప్రారంభించుకుని ధన్మోహన్ ప్రసంగిస్తూ మేము 1979 సంవత్సరంలో పాతబస్తీ జహానుమ లోని సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హైస్కూల్లో పదవ తరగతి పూర్తి చేసుకుని వెళ్లిపోయాం తర్వాత పై చదువుల కోసం ఎవరికి వారూ వెళ్ళిపోయాం తర్వాత ఏం జరిగిందో ఎవరికి సరిగా తెలియదు. గత కొంతకాలంగా కొంతమందిని కలుసుకోవడం ద్వారా వారి నెంబర్లు సేకరించి అందరి మిత్రులతో మాట్లాడి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు సహకరించిన మిత్రులందరికీ సభ ముఖంగా ధన్యవాదాలు తెలిపారు. వేదికపై ఒకరి తర్వాత ఒకరు తమ గడిచిన జీవితంలో బాల్యంలో జరిగినటువంటి విషయాలను గుర్తు చేసుకుని అదేవిధంగా హయ్యర్ ఎడ్యుకేషన్లో ఉద్యోగంలో కుటుంబ సభ్యులతో జరిగినటువంటి విషయాన్ని అందరితో వేదిక సాక్షిగా మనసు విప్పి మాట్లాడుకున్నాము. ఈ సందర్భంగా

▶▶ కొలిపోయిన మిత్రుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు




WE HAVE SOME CATCHING UP TO DO!!

స్వర్గస్తులైనటువంటి మిత్రులను గుర్తు చేసుకుని వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా అందరం రెండు నిమిషాలు మౌనం పాటించాము. అనంతరం అందరం ఆట పాట ఆర్కె స్టార్స్ లో డ్యాన్సులతో చిందులు వేసి మమ్ములను మేము మైమర్చిపోయి ఆనందలతో గడిపాము అదే విధంగా మంచి విందు భోజనము చేసి పాత జ్ఞాపకాలని చేదు అనుభవాలను గడిచిన ఈ 45 సంవత్సరాల కాలంలో జరిగిన అన్ని విషయాలని ఒకరినొకరు మాట్లాడుతున్నాం ఆ సందర్భంలో మేము మా గురువులతో గడిపినటువంటి విషయాలను కూడా గుర్తు చేసుకుంటూ కాలేజీ రోజుల్లో సాహస కార్యక్రమాలు ఉద్యోగంలో పిక్నిక్లు గడిపినటువంటి సందర్భాలని గుర్తు చేసుకొని సంతోషించాము.. ఎంతో కాలం నుంచి ఇలా కలుసుకోవాలని ఆకాంక్ష 45 సంవత్సరాలకు తీరినందుకు అందరూ సంతోషంగా ఒకరినొకరు అలైబలై తీసుకొని ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నాం. ఈ సందర్భంగా ఈ సమావేశానికి హాజరైన మిత్రులందరికీ ఈ కార్యక్రమాన్ని ఇంత చక్కగా ఏర్పాటు చేసి విజయవంతం చేసిన ధర్మోన్ సింగ్ మరియు గిరిధర్ రావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమానికి హాజరైన మిత్రులు జానకిరామరాజ్ , గిరిధర్ ,ఆనంద్ రెడ్డి ,జోజి ,ధన్మోహన్ సింగ్ , అప్స్ ప్రకాష్ , వినోద్ కుమార్ , రఘువీర్,జోషిరాజ్ , చిన్నయ్య ,శ్రీనివాస్ రెడ్డి ,నాగరాజ ,రామేశ్వర్ ,రవీందర్ , నాగభూషణం , రాజేందర్, మురలి క్త్రిష్ణ ,శ్రీనివాస్ రెడ్డి , రామ్ కుమార్ , రాజేందర్ ప్రసాద్ , ప్రతాప్ రెడ్డి ,నాగేంద్ర ప్రసాద్ , వినోద్ రెడ్డి ,వినోద్ కుమార్ , ఓం రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.


## అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షించే విధంగా కేంద్ర బడ్జెట్

**బి.జె.పి సీనియర్ నాయకులు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి**



వనస్థలిపురం,మేజర్‌న్యూస్ఃపేదలు, మధ్య తరగతి, యువత, రైతులు, మహిళల పురోభివృద్ధి లక్ష్యంగా సంక్షేమానికి పెద్ద పీట వేసే విధంగా కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యక్తిగత ఆదాయం 12 లక్షల వరకు ఎలాంటి పన్ను వసూలు చేయబోమని తీపి కబురు చేయడం హర్షణీయమన్నారు. మధ్య తరగతి ప్రజల ఆదాయం పెరిగే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని జక్కిడి పేర్కొన్నారు. ప్రాణాలను రక్షించే మందుల ధరలు తగ్గించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, ప్రాణాంతకమైన కేన్సర్ నియంత్రణ కోసం జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేయడం ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక చొరవకు నిదర్శనమన్నారు. రైతుల సంక్షేమం కోసం పి.ఎమ్ కృషి యోజన కింద రైతులకు అగ్రికల్చర్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పట్ల ప్రజల్లో ఆనందత్సవాలు వెల్లు వెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ సెమీ ఫైనల్‌లో హైదరాబాద్ సూపర్ స్టార్స్




హైదరాబాద్, మేజర్‌న్యూస్: వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ సెమీ ఫైనల్‌లో హైదరాబాద్ సూపర్ స్టార్స్ అడుగు పెట్టింది. ఈ ప్రారంభ ఎడిషన్‌లో చెన్నై సూపర్ చాంప్స్‌తో 2-3 తేడాతో ఓడిపోయినప్పటికీ హైదరాబాద్ సూపర్‌స్టార్స్ సెమీ ఫైనల్‌లో తమ స్థానాన్ని ఖాయం చేసుకుంది. అయితే, ఈ పోటీలో నిలవడానికి చెన్నైకి భారీ ఆధిక్యం అవసరం ఉంది. ఆ ఆధిక్యాన్ని అందుకోలేకపోయింది. దీంతో హైదరాబాద్‌కు సెమీ ఫైనల్స్ లైన్ ఖరారైంది. పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన బెంగళూరు జవాన్స్ సెమీఫైనల్‌లో హైదరాబాద్ సూపర్‌స్టార్స్‌తో పోటీ పడనుంది. మరో సెమీఫైనల్‌లో ముంబై పికిల్ పవర్, పుణే యునైటెడ్ తలపడనున్నాయి. ఈ రెండు మ్యాచ్‌లు ఫిబ్రవరి 1న జరుగనున్నాయి. చెన్నై సూపర్ ఛాంప్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ సూపర్‌స్టార్స్‌పై 3-2తో నాటకీయ విజయాన్ని సాధించింది. గౌరవప్రదంగా టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో రాస్ విటాకర్ 21-17తో పురుషుల సింగిల్స్‌లో విజయం సాధించగా, ఆవా కవాటాయో, మడలినా గ్రిగోరియు 20-17 తేడాతో మహిళల డబుల్స్‌లో గెలిచారు. 2-0తో ముందంజలో ఉన్న హైదరాబాద్ టీమ్ ఒక దశలో క్లీన్ స్వీప్‌కి దగ్గరగా కనిపించింది. చెన్నై సూపర్ ఛాంప్స్ మళ్ళీ గట్టిపోటీ ఇచ్చింది. ఎటియెన్ బ్లాజ్‌కెవిక్జ్, టానర్ టోమస్సీ 32-5తో పురుషుల డబుల్స్‌లో అద్భుత విజయం సాధించారు. ఆ తర్వాత థాడ్డియా లాక్ 21-15తో మహిళల సింగిల్స్ గెలిచి మ్యాచ్‌ను డిసైడర్‌కు తీసుకెళ్లింది. చివరి మిక్స్‌డ్ డబుల్స్‌లో బ్లాజ్‌కెవిక్జ్, సారా జేన్ లిమ్ జోడీ 11-10 తేడాతో ఉత్కంఠపూరిత విజయాన్ని నమోదు చేసి చెన్నైకి గెలుపును అందించారు.లీగ్ దశ ముగియడంతో సెమీఫైనల్‌లో హోరాహోరీ పోరుకు సిద్ధమయ్యాయి. అగ్రస్థానంలో ఉన్న బెంగళూరు జవాన్స్ హైదరాబాద్ సూపర్‌స్టార్స్‌తో తలపడనుండగా, ముంబై పికిల్ పవర్, పుణే యునైటెడ్ జట్ల మధ్య మరో ఆసక్తికర పోరు జరగనుంది. ఫైనల్ లీగ్ స్టాండింగ్స్: బెంగళూరు జవాన్స్ గెలిచిన టైస్: 4 పాయింట్స్: 52 (అర్హత) ముంబై పికిల్ పవర్ గెలిచిన టైస్: 4 పాయింట్స్: 50 (అర్హత) పుణే యునైటెడ్ గెలిచిన టైస్: 2 పాయింట్స్: 37 (అర్హత) హైదరాబాద్ సూపర్‌స్టార్స్ గెలిచిన టైస్: 2 పాయింట్స్: 34 (అర్హత) చెన్నై సూపర్ ఛాంప్స్ గెలిచిన టైస్: 2 పాయింట్స్: 25 (ఎలిమినేట్)

దిల్లీ దిల్‌వాలే గెలిచిన టైస్: 1 పాయింట్స్: 24 (ఎలిమినేట్)

## పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్ : వినోద్ కుమార్ గౌడ్



కూకట్ పల్లి మేజర్ న్యూస్ :వికసిత్ భారత్ లక్ష్యంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వరుసగా ఎనిమిదో సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్‌కు భారతీయ జనతా పార్టీ బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, బాలల విద్య, న్యూట్రీషియన్ అండ్ హెల్త్ నుంచి స్టార్టప్, ఇన్నొవేషన్ వరకూ ప్రతి రంగంపైన బడ్జెట్‌లో దృష్టి సాధించారన్నారు. అదేవిధంగా 12 లక్షల ఆదాయం వరకూ జీరో టాక్స్ వల్ల మధ్యతరగతి వర్గం ఎప్పుడూ మోదీ హృదంయలో ఉంటారని అన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ పరిమితి రూ.5 లక్షలకు పెంచడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మోదీ 3.0 విజనరీ బడ్జెట్ అని ఈ సందర్భంగా వినోద్ కుమార్ గౌడ్ ప్రశంసించారు.

# సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి : రాష్ట్ర ప్రభుత్వానికి గోర్ సేన విజ్ఞప్తి



హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : ఫిబ్రవరి 15న జరిగే సేవాలాల్ 286వ జయంతిని రాష్ట్ర సెలవు దినంగా ప్రకటించాలని గోర్ సేన నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ నాయక్ మాట్లాడారు. గత ఏడాది సేవాలాల్ జయంతిని ఐచ్ఛిక సెలవ దినంగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఏడాది అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. లంబాడాల ఆరాధ్య దైవం సేవాలాల్ కు రాష్ట్ర ప్రభుత్వం తగిన గౌరవం కల్పించాలన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవుల ప్రముఖుల జయంతులకు సెలవు దినంగా ప్రకటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తమ విషయములో కూడా తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో హైదరాబాదు జిల్లా అధ్యక్షురాలు దీపికా నాయక్, సంజీవ్ రాథోడ్, రాజు నాయక్ ,వురం దాస్ నాయక్, రమేష్ నాయక్, సూర్య నాయక్ ,సంజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా శ్రేయస్సే నా ధ్యేయం : కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్

**డి ఆర్ డి ఎల్ కాలనీలో 10 లక్షల 50 వేల నిధులతో ఓపెన్ జిమ్ ప్రారంభం**





కర్మన్ ఘాట్, మేజర్ న్యూస్ :ఆరోగ్యంగా పరిరక్షణకు ఓపెన్ జిమ్ దోహదపడతాయని, ప్రజా శ్రేయస్సును దృఎష్టిలో పెట్టుకొని డివిజన్లో అభివృఎద్ధి పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని డిఆర్డిఎల్ కాలనీలో 10 లక్షల 50 వేల తో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు ప్రతిరోజు ఒక గంట సేపు వ్యాయామం చేయాలని సూచించారు. అందులో భాగంగానే డివిజన్లోని పలు కాలనీలలో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను తన దృఎష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీలో సంక్షేమ సంఘ భవనం నిధులు లేక అర్ధాంతరంగా ఆగిపోయిన విషయం విధితమే, తొందరలోనే నిధులు మంజూరు చేయించి పూర్తి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంప్రసాద్ ,రాజేంద్రప్రసాద్, కరుణాకర్ రెడ్డి ,గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, బ్రహ్మారెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, మమతా ,మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ వైద్యులకు సమాజంలో గుర్తింపు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



సీతాఫలమండి, మేజర్ న్యూస్: సమాజంలో వైద్య వృత్తి పవిత్రమైనదని, ప్రజల్లో ఆదరణ పొందిన వైద్యులకు నిరంతరం గుర్తింపు ఉంటుందని సికింద్రాబాద్ శాసన సభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన వైద్యాధికారిణి డాక్టర్ సక్కుబాయి పదవీ విరమణను పురస్కరించుకొని శనివారం సీతాఫలమండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెను పద్మారావు గౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు డాక్టర్ సక్కుబాయి సేవలు చిరస్మరనీయంగా నిలుస్తాయని ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేతను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలి : డాక్టర్ మాధవి చౌదరి

**కళింగలో జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన షురూ**



సోమాజిగూడ /మేజర్ న్యూస్ : బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన సెలబ్రెటీ సీక్రెట్స్ ఫౌండర్ డాక్టర్ మాధవి చౌదరి శనివారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి హాలులో కొలువుదీరిన చేనేత కారులు వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కారులతో విభిన్న రకాల హ్యాండ్ లూమ్ చీరల తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలవడిగా తిరిగారు.భారతీయ సంస్కృఎతి లో పట్టు , హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని డాక్టర్ మాధవి చౌదరి అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలెదన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని, ప్రతి ఒక్కరు చేనేతకారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ, ఈ నెల 9వ తేది వరకు కొనసాగుతున్న ప్రదర్శన లో దేశం లోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారులు , చేతి పని బృఎందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటిరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులొ ఉంచారని వివరించారు.

# సర్వైకల్ క్యాన్సర్ ఎలా వస్తుంది

**డి.వై. యుగంధర్ రెడ్డి సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ**



హైదరాబాద్, మేజర్ న్యూస్: సరైకల్ కాన్సర్ అంటే ఏంటి ఎలా వస్తుంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ను సరైకల్ కాన్సర్ అంటారు. అధికంగా 35 - 50 సంవత్సరాలు వయస్సు గల స్త్రీలకు వస్తుంది. ఇది ఎచ్పివి వైరస్ వలన వస్తుంది. 90 శాతం మంది లో ధూమ పానం కూడా ఈ క్యాన్సర్ రిస్కుని పెంచుతుంది.

సరైకల్ కాన్సర్ లక్షణాలు ఎంటికీ, ఏలా త్వరగా గుర్తించాలి : ఋతుకాలం మధ్యలో రక్తస్రవం అవ్వడం ముఖ్య లక్షణ అధిక రక్తస్రవం రెండో లక్షణం. దుర్వాసనతో కూడిన తెలుపు స్రావం మూడవ లక్షణం పొత్తికడుపు దిగువ భాగంలో నొప్పి,నాలుగవ లక్షణం.రెగ్యులర్ పాప్ స్మియర్ ఎచ్ వి పి - డీఎన్ఏ టెస్ట్ ద్వారా త్వరగా గుర్తించవచ్చు.సరైకల్ కాన్సర్ ను ఎలా నిర్ధారణ చేస్తారు : పర్ వాజినాల్ పరీక్ష చేసి కొత్త బ్యపిసి ద్వారా కాన్సర్ ని నిర్ధారణ చేస్తారు. ఇది ఓపిడి లో చేయగలరు. ఎమ్ఆర్ఐ అవసరమైతే పీఈటి స్కాన్ ద్వారా కాన్సర్ స్టేజీని నిర్ధారిస్తారు.చికిత్స పద్ధతులు: మొదటి స్టేజి ఉన్న వాళ్లకి సర్జరీ ముఖ్యమైనది. ఈ క్యాన్సర్ లో ఓపెన్ సర్వర్ నే బెటర్ ల్యాసోసో సీ రోబోటిక్ కంటే రెండు,మూడవ స్టేజీలలో రేడియో థెరపీ కీమో తెరపీ ఇస్తారు. నాలుగవ దశలో కీమోతెరపీ, టార్గెటెడ్ తెరపీ ఇస్తారు.సర్వైకల్ క్యాన్సర్ నివారించ వచ్చా.. సర్వైకల్ క్యాన్సర్ 90 శాతం మందిలో నివారించవచ్చు. ఎచ్పివి వ్యాక్సిన్ తీసుకోవడం ముఖ్యంలో,10-15 వయసుతో అమ్మాయిలకు రెండు డోసులు15-25 వయసుల అమ్మాయిలకు




మల్కాజగిరి క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు, 'మన వాతావ రణ పొల్యూషన్ ఎలా అరికట్టాలి..., పర్యా వరణాన్ని ఎలా పరిరక్షించుకోవాలి ప్రస్తుత కాలంలో నీటిని ఎలా పొదువు చేసు కోవాలి.. సేంద్రీయ ఉత్పత్తులను ఎలా చేయాలి.. సూర్యరశ్మిని ఉపయోగించి సోలార్ విద్యుత్ తయారు చేయుట, జంక్ ఫుడ్-హెల్తీ ఫుడ్ తేడాలు, మూత్ర పిండాల విధులు,జీర్ణవ్యవస్థ ప్రక్రియ, ట్రిగనామీటరీ (త్రికోణమితి) పార్క్, డిఫరెంట్ టైప్స్ ఆఫ్ ల్యాండ్ ఫార్మ్ స్, అయోధ్య రామమందిరం మోడల్ తదితరమైనవి ప్రదర్శించారు.

# పదవీ విరమణ వయసు పెంచడం దుర్మార్గం

**మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, పబ్బతి శ్రీకృష్ణ**



హైదరాబాద్ / మేజర్ న్యూస్ :తెలంగాణా ప్రభుత్వం నిరుద్యోగ యువత కు అన్యాయం చేస్తోందని, ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న అదనపు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడం దుర్మార్గమని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. గతంలోనే మాల మహానాడు సామజిక స్పృహతో ఈ విషయాలు మీడియా ముందు పెట్టడం జరిగిందని గుర్తు చేశారు. అర్హులైన నిరుద్యోగ యువతను పక్కన పెట్టి వయసు పెరిగిన వాళ్ళకు మరింత బరువు వేసి, నిరుద్యోగ సమస్య ను మరింత పెంచడం శోచనీయమన్నారు. ఎస్సి బ్యాక్ లాగ్ ఉద్యాగాలను వెంటనే భర్తీ చేయాలనీ తద్వారా ఎస్సి కులాల్లో నిరుద్యోగం తో చనిపోతున్న వారికీ భరోసా కల్పించాల్సిన భాద్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వలపైన ఉన్నదని శ్రీకృష్ణ గుర్తు చేశారు. ఎస్సి కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు రుణాలు ఇవ్వాలని, నిధులు విడుదల చేయాలనీ శ్రీ కృష్ణ డిమాండ్ చేసారు.

## కేంద్ర బడ్జెట్‌లో దళిత జనాభా ప్రకారం నిధులు కేటాయించాలి : మాల మహానాడు డిమాండ్



హైదరాబాద్ / మేజర్ న్యూస్ : కేంద్రం ప్రభుత్వం. ప్రవేశ పెట్టనున్న బడ్జెట్ లొ దళిత సామాజిక వర్గాల జనాబా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని, మాల మహానాడు, జాతీయ అధ్యక్షులు. పబ్బతి శ్రీకృఎష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఎన్.ఎఫ్.డీ.సి ద్వారా, ఎస్సి కార్పొరేషన్ లకు నిధులు కేటాయించి అర్హులైన దళితులకు రుణాలు అందించాలని కోరారు. కేవలం దళిత ఆదివాసీ లకు గుర్తింపు ఇస్తున్నామని ప్రపంచానికి చూవుతూ, అధికారం లేని ప్రభుత్వ పదవులు ఇచ్చి, ఇతర రాజకీయ పార్టీ లకంటే ఎక్కువ పదవులిచ్చామని ప్రచారం చేసుకోవడం శోచనియమని శ్రీ కృఎష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సమాజం పట్ల ప్రభుత్వాలకు, ఏ మాత్రం ప్రేమ ఉన్నా, వాళ్ళ జనాభా దామాషా ప్రకారం కేంద్రం సహా బడ్జెట్ లో నిధులు కేటాయించాలని మాల మహానాడు డిమాండ్ చేస్తున్నదన్నారు. ప్రభుత్వ సంస్థలు ప్రైవేట్ కు కట్టబెట్టిన మోడీ, 5శాతం ఉన్న అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్ లు పెంచిన కేంద్రం దేశంలోని అన్ని ప్రైవేట్ రంగాల్లో, సంస్థల్లో రిజర్వేషన్ రిజర్వేషన్ లు అమలు జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదేశాలు జారీ చేయాలనీ డిమాండ్ చేశారు.

## గౌతంనగర్ డివిజన్‌ను ఆదర్శంగా మారుస్తా

**మేకల సునీత రాముయాదవ్**



మల్కాజిగిరి, మేజర్ న్యూస్ : అన్ని కాలనీలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి గౌతంనగర్ డివిజన్ ను అభివృఎద్ధిలో ఆదర్శంగా తీర్చి దిద్దుతానని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. శనివారం ఆమె, గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాల గూడ వెంకటేశ్వర టెంపుల్ నుండి దర్గా వరకు రూ 17 లక్షల అంచనా వ్యయం తో చేపడుతున్న సీసీ రోడ్ పనులను, మున్సి పల్ ఏఈ దివ్యజ్యోతితో కలిసి పరిశీలించా రు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీత రాముయాదవ్ మాట్లాడుతూ..నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్ పనులలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందు లు తలెత్తకుండా ఈ పనులను సాధ్యమైనం త త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని ఆమె సంబంధిత అధికా రులను ఆదేశించారు. డివిజన్ లో ప్రతి కాలనీ అభివృఎద్ధి లక్ష్యంగా పని చేస్తున్నానని ప్రజలు అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియ ర్ నాయకులు మేకల రాముయాదవ్, డివి జన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్



హైదరాబాద్,మేజర్ న్యూస్ : ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ అండ్ సీఈఓ సమ్మిట్‌ను నిర్వహించింది, ఇది కార్పొరేట్ ఆవిష్కరణలు, వ్యవస్థాపకత అంతర్జాతీయ సహకారంపై చర్చించడానికి రంగ నిపుణులు, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సమ్మిట్‌లో 50-60 మంది గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ ) నాయకులు పాల్గొన్నారు, మెంటర్‌షిప్, మార్కెట్ యాక్సెస్ ఫండింగ్‌ను అందించడం ద్వారా ప్రారంభ వృద్ధికి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ లు ఉత్ప్రేరకాలుగా ఎలా పనిచేస్తాయనే దానిపై కూడా సమ్మిట్‌లో చర్చలు జరిగాయి, తద్వారా అభివృద్ధి చెందుతున్న వెంచర్‌లకు డైనమిక్ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది.జిసిసి లకు ప్రవేశ అడ్డంకులను తొలగించడం, స్టార్ట్-అప్‌లు విశ్వవిద్యాలయాలతో నిశ్చితార్థాన్ని మరింత లోతుగా చేయడం హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా ఉంచే లక్ష్యంతో ప్రమాదాల నివారణకు సాంకేతికతను ఉపయోగించుకోవడంపై దృష్టి సారించిన రౌండ్‌టేబుల్ చర్చలను సమ్మిట్ నిర్వహించింది.గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ మంత్రి శ్రీధర్ బాబు, ఐ ఎస్ ఎఫ్ చైర్‌పర్సన్ కన్వీనర్ జె. ఎ. చౌదరి పాల్గొన్నారు . అనంతరం మంత్రి, డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థ మరియు శిక్షణ పొందిన మానవశక్తి లభ్యతతో %+జజ%ల కోసం ప్రపంచ స్థాయి కేంద్రాన్ని స్థాపించడానికి తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతను వెల్లడించారు. ఆవిష్కరణలను నడిపించే, డిజిటల్ పరివర్తనను వేగవంతం చేసే మరియు అనుకూలమైన విధాన కార్యాచరణతో రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడే వాతావరణాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన చెప్పారు.

## లక్ష డప్పులు వేల గొంతుకల ప్రదర్శనను విజయవంతం చేద్దాం : మేకల నగేష్



నిజాంపేట్ మేజర్ న్యూస్ : ఫిబ్రవరి 7వ తేదిన జరిగే లక్ష డప్పులు వేల గొంతులు ప్రదర్శనను విజయవంతం చేయాలని దళిత ఐక్య వేదిక సంఘం అధ్యక్షులు మేకల నగేష్ అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును అసెంబ్లీ సాక్షిగా అమలు చేస్తామని చెప్పి మాట తప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ సాయినగర్ బస్ స్టాప్ వద్ద ఎమ్ ఆర్ పి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడ సంజీవ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదిన మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రతినిధి మేడ సంజీవ్, ఎం.జే.ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముక్కర్ల లాలయ్య, మేడ రామ నరసింహ, జలగం చంద్రయ్య, ఉప్పలయ్య, ఎన్. ఎం. సీ బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివ రెడ్డి, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 'రామాయణ కల్పవృక్షం' మహోత్సవం గ్రాండ్ ఓపెనింగ్



బంజారాహిల్స్,మేజర్ న్యూస్ : హైదరాబాద్‌లోని సీసీఆర్‌టీ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు కొనసాగనున్న ప్రతిష్ఠాత్మక సంగీత, నృత్య మహోత్సవం 'రామాయణ కల్పవృక్షం' ప్రారంభమైంది. లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ ఉత్సవంలో దేశంలోని అత్యుత్తమ శాస్త్రీయ కళాకారులు నృత్య, సంగీత, హరికథ, ఉపన్యాసాల ద్వారా శ్రీరాముడి తాత్విక బోధనలను ప్రతిబింబించనున్నారు. ప్రముఖ నర్తకి డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ మాట్లాడుతూ, ఈ ఉత్సవం కళా ప్రియులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందజేస్తుందని అన్నారు. శంకరానంద కళాక్షేత్రం సంగీత ప్రార్థన, హరికథ 'రామాయణం: జీవన ఋక్షం' ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. రంజనీ-గాయత్రి కర్ణాటక సంగీతం, కళాక్షేత్ర ఫౌండేషన్ నృత్యం 'శబరి మోక్షం', మణిపురి రాస్ వంటి ప్రతిష్టాత్మక ప్రదర్శనలు రానున్నాయి.ఈ ఉత్సవంలో కళారూపాలపై అనేక వర్క్‌షాప్‌లు, ఉపన్యాసాలు, చిత్రకళ ప్రదర్శనలతో పాటు 'కళా గ్రామం' ద్వారా పారంపరిక కళల ప్రదర్శన ఉంది. ఈ సంబరాలను వీక్షించేందుకు కళాభిమానులు భారీగా తరలివస్తున్నారు.

## పార్ట్ టైమ్ జాబ్ పేరిట అమాయకులను నిండా మోసగించిన ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన సి.సి.ఎస్.పోలీసులు




సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః పలు పేరుగాంచిన కంపెనీల్లో పార్ట్ టైమ్ కింద జాబ్ ను కల్పించి, అధికంగా డబ్బులను సంపాదించుకోవచ్చంటూ నౌకరీ.కామ్ పేరిట వెబ్‌సైట్‌ను ప్రారంభించి, నిరుద్యోగ యువతను రూ.1,93,760లను వసూలుచేసి,వారిని నిండా ముంచిన ఐదుగురు నిందితులను సి.సి.ఎస్. పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించడం జరిగిందని డి.సి.పి.డి. కవిత తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.....ఖైరతాబాద్‌లోని ఆనందనగర్ కాలనీలోని స్కైలైట్ అపార్టుమెంట్‌లో నివసిస్తున్న పాలడుగు దేవకృప (35),విజయవాడ చిట్టినగర్‌కు చెందిన వి.వి. శివ శంకర్ (45),నార్సింగి వట్టినాగులపల్లిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బెథం బాలరాజు (31),బండ్లగూడ కాళీ మందిర్‌లోని ద్వాకానగర్‌కు చెందిన మంత్రి ఎన్.ఎస్. ప్రజ్వల్‌రెడ్డి (24), మణికొండకు చెందిన సి. విజయ్‌సాగర్ (26)లుకల్సి ఓ గ్యాంగ్‌గా ఏర్పడి, అమాయక నిరుద్యోగ యువతకు నౌకరీ.కామ్ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి,వాటిద్వారా నిరుద్యోగకులకు పార్ట్ టైమ్ జాబ్ పేరిట వారిలో లేనిపోని ఆశలు పుట్టించి,వారివద్దనుంచి అందినంత పార్ట్ టైమ్‌కింద పలు కంపెనీల్లో ఉద్యోగంలో చేర్పిస్తానంటూ నిండా మోసం చేసిన ఐదుగురు వారివద్దనుంచి భారీగా డబ్బులను దండుకున్నారని డి.సి.పి. పేర్కొన్నారు. మోసపోయిన బాధితులు సి.సి.ఎస్.కువచ్చి నేరుగా ఫిర్యాదు చేయగా, ఫిర్యాదును అందుకున్న తమ పోలీసులు రంగంలోకి దిగి, పార్ట్ టైమ్ జాబ్ పేరిట అమాయక యువతను నిండా మోసగించిన వారిని అరెస్టుచేసి,వారివద్దనుంచి ఆరు మొబైల్ ఫోన్లు,ఒక క్యాష్ కౌంటింగ్ మిషిన్, 11 పాస్ బుక్కులు, ఆరు చెక్ బుక్కులు, మూడు డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు డి.సి.పి.డి. కవిత తెలిపారు. ఈ కేసును ఏ.సి.పి. శివమారుతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ కె. మధులత,ఎస్.ఐ.లు విజయ్ చెర్యాల,బి. ప్రణీత,పి.సి.లు, కె. సాగర్, డి. ప్రణిత,ఎన్. బాస్కర్,మనీష్‌కుమార్ తివారీ, వినయ్, ఏ. పావనీలు పాల్గొన్నారు.

## మలబార్ గ్రూప్ స్కాలర్‌షిప్ : 3,900 మంది బాలికలకు మద్దతుగా రూ. 3.14 కోట్లు..




సోమాజిగూడ/మేజర్ న్యూస్: మహిళా సాధికారతను ముందుకు తీసుకెళ్లేందుకు, మలబార్ గ్రూప్ 2024-25 విద్యాసంవత్సరానికి 3,900 మంది బాలికలకు స్కాలర్‌షిప్ ప్రకటించింది. తెలంగాణ స్టేట్ ఐఏఎస్ ఆఫీసర్స్ ఇన్స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీమతి డి. అనసూయ సీతక్క ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. తెలంగాణలోని 116 కళాశాలల విద్యార్థినుల కోసం రూ. 3.14 కోట్లు కేటాయించారు.భారతదేశ వ్యాప్తంగా 21,000 మంది బాలికలకు రూ. 16 కోట్లు అందజేసిన మలబార్ గ్రూప్, 2007 నుంచి 95,000 మందికి పైగా విద్యార్థినులకు రూ. 60 కోట్ల సహాయం అందించింది. హంగర్-ఫ్రీ వరల్డ్ ప్రాజెక్ట్, గ్రాండ్ హోమ్ ప్రాజెక్ట్, మైక్రో-లెర్నింగ్ సెంటర్లు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, సమాజ అభివృద్ధికి కట్టుబడి ఉందని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ తెలిపారు.

## సమస్యను సకాలంలో గుర్తిస్తే మరణాల సంఖ్య తగ్గుతుంది : డాక్టర్ రామచంద్ర



కూకట్ పల్లి మేజర్ న్యూస్ :ప్రజలకు ఏ అవసరం వచ్చినా ముందుండి సమాజ సేవ చేస్తున్న పరిటాల యూత్ అసోసియేషన్ సభ్యులు అభినందనీయులని హెూలిస్టిక్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి.ఎస్ రామచంద్ర అన్నారు. శనివారం అసోసియేషన్ సభ్యులు ఆసుపత్రిలో ఆయనను కలిసి మెమొంటోను భహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో హృద్రోగ మరణాలు పెరిగిపోతున్నాయని, దీనికి కారణం జీవన శైలి మార్చుకోకపోవడమే కారణమని అభిప్రాయపడ్డారు. ఆధునిక బిజీ జీవితంలో ఆరోగ్యం పట్ల అశ్రద్ధ ఎక్కువైపోతుందని, సమస్య వచ్చినపుడు సకాలంలో వైద్యులను సంప్రదిస్తే చాలావరకు మరణాల సంఖ్యను తగ్గించవచ్చన్నారు. మా ఆసుపత్రిలో అతి తక్కువ ధరలకు పరిక్షలు నిర్వహించడమే కాకుండా తరచూ ఉచితంగా మెడికల్ క్యాంప్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పరిటాల యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గుంటుపల్లి వంశీకృష్ణ, కావూరి మౌలీశ్వర్, శ్రీనివాస్, కాజా వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని కార్పోరేటర్ కు వినతి



కాప్రా,మేజర్ న్యూస్ : తమ కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైప్ లైన్,నూతన సీసీ రోడ్డు నిర్మాణాలు వంటి సమస్యలకు నిధులను కేటాయించి వెంటనే పరిష్కరించాలని కోరుతూ శనివారం లేక్ వ్యూ కాలనీ ప్రతినిధులు కార్పోరేటర్ స్వర్ణరాజ్ శివమణి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంటనే స్పందించిన కార్పోరేటర్ స్వర్ణరాజ్ సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రదాన కార్యదర్శి శ్రీనివాస్,కోశాధికారి జగదీష్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్,కాంగ్రెస్ నాయకులు పడమటీ మల్లారెడ్డి,సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# సంగీత విద్వాంసురాలు - డాక్టర్ రమాదేవికి సత్కారం..

ముషీరాబాద్ మేజర్ న్యూస్ :రాగరాగిణి సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గాబసభలో సంగీత విద్వాంసురాలు వై. రమాదేవికి ఆత్మీయ సత్కారం జరిగింది.దూరదర్శన్ కేంద్రం పూర్వ డైరెక్టర్ డాక్టర్.పాలకుర్తి మధుసూదన్ రావు ముఖ్య అతిధిగా హాజరై సంగీత విద్వాంసురాలు రమాప్రభను అభినందించారు.శ్రీ త్యాగరాజ పంచరత్న కీర్తనలను రమాప్రభ మధురంగా ఆలాపించారు.భక్తి పరిమళం చిందేలా గానం అలరించింది.భీమన్న సాహితీ నిధి అధ్యక్షురాలు హైమవతీ భీమన్న సభకు అధ్యక్షత వహించి రాగరాగిణి చేస్తున్న కళాసేవను కీర్తించారు.రమాప్రభ ప్రతిను కొనియాడారు.వీణా విద్వాంసురాలు మైథిలి కిడాంబీ అతిధిగా హాజరయ్యారు.



# పవర్ బోర్ వెల్స్‌ను వెంటనే మరమ్మతు చేయాలి: కార్పొరేటర్ శ్రవణ్



మల్కాజిగిరి,మేజర్ న్యూస్: మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో పాడైపోయిన పవర్ బోర్ వెల్స్ ను వెంటనే మరమ్మత్తు చేయించి వినియోగంలోకి తీసు కుని రావాలని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ కోరారు. శనివారం ఆయన శివపురి లోని తన కార్యాలయంలో సంబంధిత అధి కారులతో సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ..పలు చోట్ల బోర్ల రిపేర్ పనులు పెండింగ్ లో ఉన్నాయని త్వరగా వాటిని మరమ్మత్తు పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా నేరేడ్ మెట్, ఓల్డ్ మల్కాజిగిరి లో పెండింగ్ లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలన్నారు. కృపావిపా కాంప్లె క్స్ లో సివరేజ్ కనెక్షన్స్ సమ స్యను పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధి కారులు నవీన్, ధనుంజయ్, నాగార్జున, పర మేష్, స్థానికులు రాంసింగ్, శ్రీకాంత్ యాదవ్, రవి, నందుయాదవ్, షికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.


# పేద మధ్య తరగతికి అనుకూలమైన బడ్జెట్

### బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డా.వెన్న ఈశ్వరప్ప



హిమాయత్‌నగర్, మేజర్ న్యూస్ : పేద, మధ్యతరగతి, రైతులు, చిరు వ్యాపారుల, యువ పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టడం హర్షణీయం అని తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ డా.వెన్న ఈశ్వరప్ప అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మధ్య తరగతి ఉద్యోగుల, వ్యాపారులకు ఈ బడ్జెట్ ఓ వరం అన్నారు. ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మక చర్య అన్నారు. మధ్య తరగతి ప్రజల కోసం ఇంత అనుకూలమైన బడ్జెట్ ఎన్నడూ రాలేదని అన్నారు. ఇది సంస్కరణల బడ్జెట్ అని, 2027 నాటికి భారత్ ను మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించే ఆ దిశగానే ఈ బడ్జెట్ ను రూపొందించడం గొప్ప విషయం అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఇంత గొప్ప బడ్జెట్ ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల పక్షపాతి అనడానికి ఈ బడ్జెట్ నిదర్శనమని అన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ నేత సూర్యప్రకాష్ జన్మదిన వేడుక



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: బీఆర్ఎస్ మల్కాజిగిరి సీనియర్ నేత, వెస్ట్ వెంకటేశ్వర్ నగర్ కాలనీ అధ్యక్షుడు సూర్యప్రకాష్ తన జన్మదిన వేడుకను బంధుమిత్రులు, శ్రేయో భిలాషులు, బీఆర్ఎస్ నాయకులు, పద్మశాలి సంఘం నాయకులు, కాలనీ అసోసియేషన్ నాయకుల ఆనందోత్సాహాల నడుమ ఘనం గా జరుపుకున్నారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెస్ట్ వెంకటేశ్వర్ నగర్ లో నిర్వహించిన ఆయన జన్మదిన వేడుకకు బీఆర్ఎస్ రాష్ట్ర నేత, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ హజరై, పూల బొకే, శ్లావాలతో ఘనంగా సన్మానించి హార్థిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చేత కేక్ కట్ చేయించి,తినిపించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డిపార్ట్ మెంట్ జనరల్ సెక్రెటరీ ముత్యం వెంకన్న గౌడ్, పద్మశాలి సంఘం తెఈ రాష్ట్ర అధ్యక్షుడు వాలకాటి రాజ్ కుమార్, కోశాధికారి బి. నవీన్, బీఆర్ఎస్ నాయకులు వేణు, వి.శ్రీధర్, లాలూ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌లో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలి : వల్లారపు శ్రీనివాస్ టిడిపిలోకి భారీగా చేరికలు



సీతాఫలమండి, మేజర్ న్యూస్: తెలుగుదేశం పార్టీ సీతాఫలమండి డివిజన్ మాజీ అధ్యక్షులు జి.వి. కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 20 మంది యువకులు బౌద్ధనగర్ లోని తెదేపా సికింద్రాబాద్ ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ నివాసంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చేరిన వారిలో రాచకట్ల హరితేజ, దగుల్ల అరవింద్, సంద్రీ రాహుల్, ప్రకాష్, పులిపాటి గణేష్, సత్యవాడ శ్రీహరి, అయ్యప్ప, జాలా రాజశేఖర్, బొమ్మకంటి సందీప్ కుమార్, కే. నాంగేద్ర, గోపి వంశీ, గోపి శ్రీకాంత్, జాతరకొండ అనీల్ కుమార్, సన్ని గణేష్, ఎం. అనీల్‌తో పాటు మరి కొందరు తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకుడు విజన్‌కి ఆకర్షితులై యువత ఈ రోజు తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. చంద్రబాబు ఎప్పటికి కోరుకొనేది ఒకటేనని, రెండు తెలుగు రాష్ట్రాలు భారతదేశం అభివృద్ధిలో ముందుండాలనేది ఆయన చిరకాల కోరిక అన్నారు. ప్రపంచదేశాల్లో తెలుగువారి ఘన కీర్తిని చాటేలా యువత ముందుకు సాగాలన్నారు వల్లారపు శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, చిరంజీవి రాజు, శశిరేఖ, బండి మురళి, చంద్రమోహన్, నాయుడు, పుప్పాల విజయ్, టైలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నాణ్యత నిర్వహణ వ్యవస్థలపై అభివృద్ధి పై 5రోజుల వర్క్‌షాప్

జూబ్లీహిల్స్, మేజర్ న్యూస్ : ఎంఎస్ఎంఈ, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ సూక్ష్మ, చిన్న వాటికి పరీక్ష సేవలను సులభతరం చేస్తుంది. మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఐదు రోజుల నిర్వహణను నిర్వహించాలని ప్రతిపాదించింది. నాణ్యత నిర్వహణ వ్యవస్థలపై అభివృద్ధి కార్యక్రమం (నబుల్ అక్రిడిటేషన్) 10.02.2025 నుండి 14.02.2025 వరకు చదువుకున్న నిరుద్యోగ యువతకు, స్వీయ-ఉద్యోగి, మేనేజర్/నాణ్యత కలిగిన ఉద్యోగులు. శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టడానికి కనీస అర్హత డిప్లొమా/గ్రాడ్యుయేట్. కనీస వయో పరిమితి 18 సంవత్సరాలు. శిక్షణ కార్యక్రమంలో అంశాలు కవర్ చేయబడతాయి: నాణ్యత నిర్వహణ సిస్టమ్స్, ఐసీఓ , నబుల్, బి ఐ ఎస్ వంటి నాణ్యత నిర్వహణ వ్యవస్థల అమలు, లీన్ మేనేజ్‌మెంట్ వంటి క్వాలిటీ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్, 7%ుజ% మొదలైనవి ఈ నాణ్యత నిర్వహణను అమలు చేయడానికి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ప్రధాన లక్ష్యం పని యొక్క రోజువారీ కార్యకలాపాలలో సిస్టమ్స్ మరియు టెక్నిక్స్. విజయవంతమైన తర్వాత శిక్షణ కార్యక్రమం పూర్తయిన తర్వాత భారత ప్రభుత్వ సర్టిఫికేట్ జారీ చేయబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు దయచేసి పాస్‌పోర్ట్‌తో పాటు దరఖాస్తులను సమర్పించవచ్చు సైజు ఫోటో కాపీ, ఆధార్ జిరాక్స్ 10.02.2025లోపు సి.ఎస్.సుధాకర్, అసిస్టెంట్, డైరెక్టర్ %+తీ-శ్రీ%, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్-టెస్టింగ్ స్టేషన్, ఏ1 ఇండస్ట్రియల్ ఎస్టేట్, సనత్‌నగర్, హైదరాబాద్ - 500018 మొబైల్ నెం.8056019950/9494959108, వేదిక: శాస్రిత్ ఎంటర్‌ప్రైజెస్, 1-9-20, 3వ అంతస్తు, రామనగర్, 9494959108 సంప్రదించగలరు.

# హనుమాన్ నగర్‌లో కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ పర్యటన



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: మౌలాలి డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ లో శనివారం కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మౌలాలి ఏఇ మధురిమ, ఎస్ఎఫ్ఏ అజయ్, మనీషా, వర్క్ ఇన్స్పెక్టర్ నరేందర్, అశోక్ , శశికళ, రామకృష్ణ,స్వాతి,భాగ్య, రాజు, బీజేపీ పార్టీ మౌలాలి డివిజన్ అధ్యక్షుడు శివగౌడ్, శ్రీనివాస్ యాదవ్, నటరాజ్ పాల్గొన్నారు

# శ్రామిక్ నగర్ కాలనీని సమిష్టిగా అభివృద్ధి చేసుకుందాం:మొహమ్మద్ గౌస్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: మనమంతా కలిసికట్టుగా ఉంటూ మన కాలనీని మరింత అభివృఎద్ధి చేసుకుందామని శ్రామిక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్ పిలుపునిచ్చారు. శనివా రం ఆ కాలనీలోని హెడెన్ స్కూల్ ఆవరణ లో శ్రామిక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ లోని పార్క్ స్థలం అభివృఎద్ధి చేసుకోవడంతో పాటుగా, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, స్ట్రీట్ లైట్స్, సూచిక బోర్డుల ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పించుకుందామన్నారు. మన కాలనీలో ఎన్ని ప్లాట్లు ఉన్నాయో, వాటి సమాచారం తెలుసుకుందామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అబ్దుల్ హమీద్, హేమంత్, కొంతం శ్రీనివాస్ రావు, మొహమ్మద్ ఇస్మాయిల్, అబ్దుల్ రెహమాన్, శ్రీనివాసరావు, రామ్ రెడ్డి, అబ్దుల్ హమీద్, ఆజాద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# షబ్బ్ ఏ బరాత్ సందర్భంగా శ్మశానవాటికలు శుభ్రం చేయించాలి : కాంగ్రెస్



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: షబ్బ్ ఏ బరాత్ పురస్కరించుకుని మౌలాలి 138 డివిజన్ లోని శ్మశానవాటికలను పరిశుభ్రం చేయించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ మౌలాలి డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు మహమ్మద్ షకీల్, ఫైజల్,వెంకటేష్, అజయ్ తదితరులు మల్కాజిగిరి సర్కిల్ ఉపకమిషనర్ రాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. షబ్బ్ ఏ బరాత్ సందర్భంగా స్థానిక ముస్లిం లు శ్మశాన వాటికలలోని తమ పెద్దల సమాధులను వద్ద దర్శించుకుని ప్రార్థన చేస్తుటా రని తెలిపారు. ఈ స్మశానవాటికల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల చెత్తతో అపరిశు భ్రంగా మారాయని, పెరిగిన పిచ్చి చెట్లను తొలగించాలని వారు కోరారు.దీనికి డీసీ రాజు సానుకూలంగా స్పందించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# ద బెస్ట్ ఆంకాలజిస్ట్ అవార్డు - 2025 ఎంపికైన క్యాన్సర్ ప్రొఫెసర్లు

హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : గత 25 సంవత్సరాలుగా క్యాన్సర్ రహిత సమాజ స్థాపనకు పాటుపడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ గీతా నాగశ్రీ ,ప్రొఫెసర్ బి. ఉమాకాంత్ గౌడ్, ప్రొఫెసర్ జోసఫ్ బెంజిమెన్ లు ద బెస్ట్ ఆంకాలజిస్ట్ అవార్డు 20 25 కు ఎంపిక అయ్యారు. వీరికి ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా అవార్డును ఫిబ్రవరి 4న ప్రధానం చేయనున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్. రాజనారాయణ ముదిరాజ్ మరియు సెక్రెటరీ జనరల్ డాక్టర్ కె.పి హేమంత్ కుమార్ పత్రిక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రం నుంచి ముగ్గురు ప్రొఫెసర్లను ఎంపిక చేశామని అన్నారు. ఉదయం 11 గంటలకు కోటిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ లోని దర్బార్ హాల్లో జరిగే కార్యక్రమంలో ప్రముఖులు అందజేయనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని మరియు ప్రముఖ విద్యావేత్త మరియు జాతీయ పర్యావరణ పరిరక్షణ అభివృఎద్ధి మండలి సభ్యులు లయన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి లు ప్రసంగిస్తారన్నారు ఈ సందర్భంగా విద్యార్థినిలతో క్యాన్సర్ వ్యాధిపై ర్యాలీని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ గీత నాగశ్రీ గత 25 సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధి నివారణకై గర్భాశయ, అండాశయ మరియు రొమ్ము క్యాన్సర్లతో సహా అన్ని రకాల గైనకాలజీ క్యాన్సర్ శస్త్ర చికిత్సనిపుణులు జాతీయ, అంతర్జాతీయ దేశాలలో క్యాన్సర్ పై ఎన్నో సదస్సులో పాల్గొని ప్రజలను జాగృఎతి పరిచారు. హైటెక్ సిటీ లోని కేర్ ఆస్పత్రిలో సీనియర్ గైనకాలజీ సర్జికల్ ఆంకాలజిస్ట్ గా సేవలందిస్తున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ బి ఉమాకాంత్ గౌడ్ ఎం ఎన్ జే ప్రభుత్వ క్యాన్సర్ రీజనల్ క్యాన్సర్ సెంటర్ హైదరాబాద్లో క్యాన్సర్ చికిత్స నిపుణులు గత 25 సంవత్సరాలుగా నిరుపేదలకు ప్రత్యేకించి తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి వచ్చే క్యాన్సర్ రోగులకు ఓపికతో వ్యాధిపట్ల అవగాహన కల్పించి ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. ప్రొఫెసర్ జోసేఫ్ బెంజిమెన్ రేడియాలజీ ప్రొఫెసర్ గా ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రిలో సీనియర్ రేడియాలజీ గా సేవలందిస్తున్నారు. ఎంబిబిఎస్ ఎండి తర్వాత డిగ్రీలు పూర్తిచేసి క్యాన్సర్ నిర్మూలన నివారణకై ఎనలేని కృఎషి చేస్తున్నారు. క్యాన్సర్ వ్యాధిలో వ్యాధితో రేడియో థెరపీ టెక్నిక్ ను ఎండి చదివే వైద్య విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఆంకాలజీలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ లో రేడియేషన్ ఆంకాలజీ సభ్యులుగా ఉండి ఎన్నో ప్రశంసలు అందుకున్నారు ఎన్నో పరిశోధనా పత్రాలు క్యాన్సర్ రేడియేషన్ లో జరిగిన సదస్సులో సమర్పించారు. నిరుపేద ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే క్యాన్సర్ రోగులకు మంచి సలహాలు సూచనలు మనో మనో ధైర్యాన్ని ఇచ్చారు వారికి జాగృఎతి పరిచి క్యాన్సర్ రోగ నివారణకు కృఎషి చేస్తున్నారు.

# "ఫ్లై యాక్సిస్" అబ్రాడ్ ఎడ్యుకేషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



జీడిమెట్ల మేజర్ న్యూస్ : విద్యార్థులకు విదేశీ విద్య అందించడంలో ఫ్లై యాక్సిస్ అబ్రాడ్ ఎడ్యుకేషన్ విదేశీ విద్యలో ట్రేడ్ మార్క్ గా నిలవాలని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి వెన్ సాయి వద్ద సాయి గణేష్ రెడ్డి, దిలీప్ రెడ్డి, గణేష్ రెడ్డి, సాయికిరణ్ రెడ్డి ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్లై యాక్సిస్ అబ్రాడ్ ఎడ్యుకేషన్ ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రోజురోజుకు యువత విదేశీ విద్య వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, కొంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, నాయకులు కాలే నాగేష్, కాలే గణేష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జలమండలిలో 10 మంది ఉద్యోగులు పదవీ విరమణ



హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతినిధి):జలమండలిలో 10 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. బోర్డులో వివిధ స్థాయుల్లో పని చేస్తూ రిటైర్ అయిన వీరిని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాల్ని చెక్కు రూపంలో అందజేశారు. పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో నాణ్యమైన సమయం గడపాలని, జీవితం సంతోషంగా ఉండాలని వారు ఆకాక్షించారు.

ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు చేయూత



హయత్ నగర్, మేజర్ న్యూస్: ఎల్.బి నగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరషత్ ప్రైమరీ స్కూళ్లకు ఐడిబిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ. 1.75 లక్షలతో కూడిన మూడు కంప్యూటర్లు, ప్రింటర్స్, టేబుల్స్ ను జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డిని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించి ఎల్.బి నగర్ ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్, డీజీఎం తను మైకేల్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామ్ సుందర్ రెడ్డి, కవిత రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ సిబ్బంది రీజనల్ ఆఫీసర్ హరికృష్ణ, ఏజిఎం మాధవి, సుధీర్, పాఠశాల హై స్కూల్ ఇన్చార్జి రామలింగం, అసిస్టెంట్ సిద్ధు, స్కూల్ ఉపాధ్యాయులు, బీజేపీ డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి, యాంజల్ జగన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# సుందర శోభితంగా రేగుల కుంట చెరువు

**పీఏసీ చైర్మన్ ఎమ్మెల్యే గాంధీ**



చందానగర్,మేజర్ న్యూస్ : చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్ కాలనీలో గల రేగుల కుంట చెరువు సుందరికరణలో భాగంగా భాగంగా రూ.60 లక్షల రూపాయల అంచనావ్యయంతో చేపట్టనున్న యూజీడీ పైప్ లైన్ నిర్మాణ పనులను శనివారం పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే గాంధీ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేపడుతున్నామని , మురికి కూపంలాంటి చెరువు స్వచ్ఛమైన మంచి నీరు లాంటి చేరువుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేసి చెరువును పునరుద్ధరణ చేసిన శుభసందర్భంగా చెరువు లో మురుగు నీరు కలవకుండా 60 లక్షల రూపాయలతో చెరువు చుట్టూ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సందీప్ రెడ్డి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బాపూనగర్ బస్తీలో ప్రభుత్వ భూమి ఆక్రమణ

**-అమీర్ పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎస్ రావు**



అమీర్ పేట,మేజర్ న్యూస్: అమీర్ పేట డివిజన్ పరిధిలోని బాపూనగర్ బస్తీలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎస్ రావు ఆరోపించారు.ఈ మేరకు శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.బాపూనగర్ బస్తీలో 125 చదరపు గజాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో 85 చదరపు గజాలు ఆక్రమణకు గురైందన్నారు.దాని వల్ల బస్తీవాసులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.అయితే ఆక్రమణకు గురైన స్థలంలోనే అమీర్ పేట డివిజన్ బిజెపి కార్పొరేటర్ నీటి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు.దానిపై కాంగ్రెస్ నాయకుల తరపున అభ్యంతరం వ్యక్తం చేశారు.భూ ఆక్రమణ సమస్య పరిష్కారమయ్యే వరకు నీటి ప్లాంట్ ఆలోచన విరమించుకోవాలని కార్పొరేటరుకు సూచించారు.ప్రభుత్వం కూడా సమస్యపై శ్రద్ధ వహించి పరిష్కరించాలని విన్నవించారు.నీటి ప్లాంట్ అవసరమా లేదా అనే విషయాన్ని బాపూనగర్ వాసులను అడగాలన్నారు.వారి అభిప్రాయ సేకరణ చేపట్టిన తరువాతే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రతాప్ నాయక్,కృష్ణకుమార్, నరేశ్, పద్మావతి,ఆండాలు,నవీన్ రాజ్,రవి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు

**త్రినిటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**




జవహర్ నగర్,మేజర్న్యూస్ః జవహర్నగర్ మున్సిపల్ కార్పోరేషన్లోని నాచారం ఫైర్విక్టిం కాలనీలో శనివారం త్రినిటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని డిఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. శిబిరంలో సమీప ప్రాంతాలకు చెందిన రోగులకు పరిక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణి చేశారు. ఈసందర్బంగా ఎర్రగుంట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదలు నివసిస్తున్న బస్తీల్లో త్రినిటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో వైద్యులు అఖిల్, కోఆర్డినేటర్ ఎలిజబెత్, మేనేజర్ కార్తిక్, డిఎస్ఎస్ జవహర్నగర్ అధ్యక్షులు అందే నరేందర్, యూత్ అధ్యక్షులు పరమేష్చారి తదితరులు పాల్గోన్నారు.




# విద్యార్థులు చదువులలో రాణించాలి

**జిల్లా విద్యాధికారి విజయలక్ష్మీ**



కాప్రా.మేజర్ న్యూస్..విద్యార్థులు శ్రద్ధతో విద్యనభ్యసించి చదువులలో రాణించాలని జిల్లా విద్యాధికారి విజయలక్ష్మీ పేర్కోన్నారు. శనివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ బొంతు శ్రీదేవి తో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత 36సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత పౌండర్,చైర్మన్ ప్రతాప్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాపిరెడ్డి,రేష్మి,మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు గోపాల్ యాదవ్,భాషాబాయ్,హీరాలాల్ నాయక్, బానుచందర్, సత్యనారాయణ,వెంకటేష్,ఇతరులు రమారెడ్డి,నీరజారెడ్డి,అరుణ,వరలక్ష్మీలు పాల్గోన్నారు.

# ఎస్సీ సెల్ దళిత సేన రాష్ట్ర అధ్యక్ష్యులుగా భ్యాగరి చంద్రశేఖర్



ఎర్రగడ్డ,మేజర్ న్యూస్ : తెలంగాణ దళిత సేన ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్ష్యులుగా ఎర్రగడ్డకు చెందిన భ్యాగరి చంద్రశేఖర్ నియమితులు అయ్యారు. ఈ మేరకు దళిత సేన జాతీయ అధ్యక్ష్యులు జేబీ రాజు, రాష్ట్ర అధ్యక్ష్యులు గంట మల్లేష్ చేతుల మీదుగా చంద్రశేఖర్కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గత గురువారం జాతీయ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దళిత సేన నాయకుల నిర్ణయం మేరకు నాకు ఈ అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేస్తు జేబి రాజు అలాగే గంట మల్లేష్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నా బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి నాయకులు సహకారంతో ఎస్సీల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అలాగే వారి అభివృద్ధికి పాటుపడతానని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.సుధాకర్, వేముల యాదయ్య, చిన్నయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## వ్యాపార రంగంలో సి ఏ ల పాత్ర ఎంతో అవసరం : అనుముల తిరుపతి రెడ్డి



సోమాజిగూడ/మేజర్ న్యూస్: వ్యాపార రంగంలో నేడు చార్టెడ్ అకౌంట్ల పాత్ర ఎంతో కీలకం అని కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అనుమల తిరుపతి రెడ్డి అన్నారు, శనివారం నగరంలోని ఆనంద్ నగర్ లో బెల్ది అసోసియేట్స్ నూతన కార్యాలయాన్ని అయన చేతుల మీదుగా ప్రారంభించారు, ఈ సందర్భంగా అయన మాట్లాడుతు సమాజంలో, వ్యాపార రంగాలలో చార్టెడ్ అకౌంట్ ల అవసరం ఎంతో ఉంది అన్నారు.
ఈ సందర్భంగా బెల్దీ అసోసియేట్స్ సీఎండి, చార్టర్డ్ అకౌంటెంట్ బెల్దీ శ్రీధర్ మాట్లాడుతూ, సంస్థకు 37 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించామని తెలిపారు. నూతన కార్యాలయం క్లయింట్లకు అధిక నాణ్యతా ప్రమాణాలతో మరింత మెరుగైన సేవలను అందించడానికి ప్రత్యేకంగా రూపుదిద్దుకున్నదని చెప్పారు.ప్రస్తుతం భారతదేశవ్యాప్తంగా ప్రముఖ కంపెనీలకు సేవలు అందిస్తున్న బెల్దీ అసోసియేట్స్, అత్యంత ప్రతిభావంతమైన చార్టర్డ్ అకౌంటెంట్ల బృందంతో నాణ్యమైన ఆర్థిక, వ్యాపార సలహాలను అందిస్తోంది.ఈ కొత్త కార్యాలయంతో, సంస్థ తన సేవలను మరింత విస్తరించి, ఆర్థిక, వ్యాపార కన్సల్టింగ్ రంగంలో అగ్రగామిగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి కృషి చేస్తోంది.ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, కామిశెట్టి అనిల్ సీఏ ఛాంబర్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఉప్పల శ్రీనివాస్, ఉప్పల శివ కుమార్, జె. రాంబాబు, బండారు సుబ్బారావు, ఆలపాటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. వీరు బెల్దీ శ్రీధర్ కు అభినందనలు తెలిపారు.

# ఇది ప్రజా రంజక బడ్జెట్

**- ముమ్మాటికీ ప్రజామోద బడ్జెట్ - సామాన్య, పేద మధ్య తరగతి ప్రజలకు వ్యవసాయ రంగానికి పెద్దపీట**

**- ఎవరూ ఉహించనట్లుగా ఇన్ కం టాక్స్ 12 లక్షలు వరకు తగ్గించడం శుభపరిణామం**


**- అన్నివర్గాలకు లబ్ది చేకూరే బడ్జెట్ - రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యదర్శి చెన్నమనేని స్రవంతి**



కూకట్ పల్లి మేజర్ న్యూస్: సామాన్యుల పాలిట కల్పతరువు కేంద్ర బడ్జెట్ అని రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యదర్శి చెన్నమనేని స్రవంతి అన్నారు. కేంద్ర బడ్జెట్ సామాన్యుల కలలను సాకారం చేసే అద్భుత బడ్జెట్, పేదలు, యువత, రైతులు, మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన బడ్జెట్ అని అన్నారు.
ఇది విజనరీ బడ్జెట్, దేశాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టించే బడ్జెట్, ప్రపంచ దేశాల్లో భారత్ ను అగ్రగామిగా నిలబెట్టే బడ్జెట్, గ్రామీణ భారతాన్ని ప్రత్యేకించి వ్యవసాయ రంగాన్ని ఆర్థికంగా మరింత పరిపుష్టం చేసే బడ్జెట్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ సమస్యను తగ్గించడం, మహిళా సాధికారతను సాధించడం లక్ష్యాలుగా రూపొందిన బడ్జెటు ఇది ... ఇటు సంక్షేమానికి, అటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ కేంద్రం సమతుల బడ్జెటును రూపొందించింది. ఇంత ఉత్తమమైన, ఆదర్శ బడ్జెటును దేశ అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరు స్వాగతించాలని అన్నారు. మధ్యతరగతి ప్రజలకు కేంద్రం గుడ్ న్యూస్ రూ.12 లక్షల వరకు నో ట్యాక్స్, ఆరోగ్య రంగంలో కీలక నిర్ణయాలు, అన్ని జిల్లా ఆస్పత్రుల్లో డే-కేర్ క్యాన్సర్ సెంటర్లు, 2025-26లో 200 క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత గ్రామీణ ప్రాంతాల్లో సంపద సృష్టించడానికి చర్యలు, రైతుల ఆదాయాన్ని పెంచడానికి చర్యలు, భవిష్యత్తు ఆహార భద్రత కోసం రెండో జన్యు బ్యాంకు ఏర్పాటు, వంద జిల్లాలను ఎంపిక చేసి వ్యవసాయంలో అధునూతన పద్ధతులను అమలు చేసి దేశానికి దిశా నిర్దేశం చేయడమే అన్నారు.
జ్ఞాన భారత మిషన్ ఏర్పాటు ... ఐఐటి విద్యార్థులకు రూ.పది వేల కోట్ల స్కాలర్ షిప్ లు ప్రకటించడం అభినందనీయమన్నారు. ప్రజారాంజక బడ్జెట్ను ప్రకటించిన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ తో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌కు అనుకూలంగా ఉంది

**జాతీయ స్థూల ఉత్పత్తి లో అధిక నిధులను కేటాయించకపోవడం శోచనీయం : ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఖండన**




హైదరాబాద్, మేజర్ న్యూస్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరర్థక, యువజన వ్యతిరేక బడ్జెట్ అని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర లు ఖండించారు. యువజన, విద్యార్థి వ్యతిరేక బడ్జెట్, కార్పొరేట్ అనుకూల మోడీ విధానాలు నశించాలన్నారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర లు సంయుక్తంగా మాట్లాడుతూ, ఉపాధి కల్పన కోసం నిర్దిష్టమైన చర్యలు ప్రతిపాదించలేదని, విద్య, వైద్యం, ఉద్యోగకల్పన రంగంలో ప్రతిపాదనలన్నీ డొల్లగానే ఉన్నాయని ,ఉద్యోగకల్పనా రంగం ఉద్యోగాలులేని రంగంగా మారిందని వాపోయారు. మోదీ ప్రభుత్వ తొలి పదేళ్లకాలంలో ఉద్యోగాల కల్పనే లేదన్నారు.మోదీ ప్రభుత్వకాలంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేం దుకు ఆర్థిక మంత్రి నానాతంటాలు పడ్డారని ఆరోపించారు.సమ్మిళిత అభివృద్ధి, యువత సాధికారత, ఆర్థికరంగ వృద్ధి, పచ్చదనం వృద్ధి అవకాశాలను అపారంగా వినియోగించుకోవడం, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు లాంటివి ప్రతిపాదించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించింది. రాష్ట్ర విభజనలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా తెలంగాణ రాష్ట్ర విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తూ ఐఐటి , త్రిబుల్ ఐటీ ,సైనిక్ స్కూలు లాంటి సదుపాయాలను కల్పించకుండా విద్యార్థులను అంధకారంలోకి నేట్టివేసే కుట్ర మోడీ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు.కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతూ విద్యలో కాషాయీకరణను చొప్పించే ప్రయత్నాలు గత పది సంవత్సరాల నుండి బిజెపి ప్రభుత్వం చేస్తుందని అన్నారు.ఈ బడ్జెట్ లోనైనా ఎంతో ఆశలు పెట్టుకున్న యువత కు తీవ్ర నిరాశే మిగిలిందని, ఉపాధి కల్పనను దురాఘాతం చేసే నీచ బడ్జెట్ గా అభివర్ణిస్తున్నట్టు తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి



**-సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్**

**-ఫెడరేషన్ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి**

**-సంఘానికి సభ్యత్వ నమోదు కీలకం**

**-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

హైదరాబాద్, మేజర్ న్యూస్: రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై త్వరలో ఉద్యమాలు తప్పవని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టులకు మరిన్ని గడ్డు పరిస్థితులు వస్తాయని, ఈ విషయంలో జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఫెడరేషన్ నాయకత్వం సిద్ధం కావాలని సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఫెడరేషన్ స్థానిక ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాను రాను జర్నలిస్టుల హక్కులు హరింపబడుతున్నాయని, పాలకులు ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా దాటవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు అధికారంలో కొనసాగిన గత ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పూర్తిగా విస్మరించి తీరని అన్యాయం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులు ఇవ్వలేక పోయిందని, జీవో 239 సమీక్ష పేరుతో కమిటీ వేసి కాలయాపన చేస్తుందని విమర్శించారు. రాబోయే ఒకటి, రెండు నెలలు జర్నలిస్టులకు కీలకమని, ఎందుకంటే అక్రెడిటేషన్ కార్డులను బాగా తగ్గిస్తారనే ప్రచారం జరుగుతోందని అన్నారు. అక్రెడిటేషన్లు తగ్గిస్తే ఊరుకునేది లేదని, రాష్ట్రవ్యాపితంగా ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్ స్కీం, హెల్త్ కార్డులు, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీలు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తదితర డిమాండ్ల సాధనకై ఫెడరేషన్ ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు చేయాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫెడరేషన్ బలోపేతానికి ప్రతి జిల్లా, నియోజకవర్గాల్లో జర్నలిస్టులంతా కలిసిరావాలని, ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా సంయుక్త కార్యదర్శి వంగాల వెంకన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు జి. జమున, ఓరుగంటి సుభాష్ , పి.వెంకన్న, వై.అశోక్.ఎ.రాములు, పి. శశి, జి.క్రాంతి, వై.యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

అడ్ హాక్ కమిటీ ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తుంగతుర్తి నియోజకవర్గం అడ్ హాక్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక్కెంది. కన్వీనర్ గా వంగాల వెంకన్న(జ్యోతి దినపత్రిక), కో-కన్వీనర్లుగా పల్లా సత్యనారాయణ(సూర్య),అబ్బగాని వేణు(తెలంగాణవార్త), షేక్ జాని ఎన్నికయ్యారు. అడ్ హాక్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి నియోజకవర్గం మహాసభ, నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియను జరపాలని సమావేశం తీర్మానించింది.

# నిరంతరం నూతనత్వం కోసం నా అన్వేషణ - సుప్రసిద్ధ కవి, విమర్శకులు ఏటుకూరి ప్రసాద్



ముషీరాబాద్ /మేజర్ న్యూస్ :సాహిత్య సృజన, పరిశోధన, బోధన ఇలా ఎ రంగంలోనైనా నిరంతరం నూతనత్వం కోసం అన్వేషించడమే 8 దశాబ్దాలుగా నా వాద్రియ కృషికి ప్రేరణ అని సుప్రసిద్ధ కవి, విమర్శకుడు, వక్త, పరిశోధకుడు, నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ తెలిపారు. కళ కళకోసం కాదని, ప్రజల కోసమన్నది తన ప్రగాఢ విశ్వాసమన్నారు. సాహిత్య ప్రయోజనం సమసమాజ నిర్మాణమన్నది నా లక్ష్యం' అంటూ తన జీవిత, సాహిత్య విశేషాలను విశదీకరించారు. ప్రజా ఉద్యమాలకు అవసరమైన పాటలు, సాహిత్య ప్రయోజనం కోసం 100కు పైగా విమర్శ వ్యాసాలు రాసినప్పటికీ 'అరసం నా చిరునామా అని, మార్క్సిజం నా ఊపిరి' అంటూ ఏటుకూరి ప్రసాద్ వివరించారు.శనివారం రవీంద్ర భారతి సమావేశ మందిరంలో కేంద్ర సాహిత్య అకాడమీ, తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'విమర్శకుడి (ఏటుకూరి ప్రసాద్) తో ఒక సాయంత్రం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏటుకూరి ప్రసాద్ మాట్లాడుతూ 'బాల్యంలో భక్తి గీతాలు పాడుతూ ప్రభాతభేరి కార్యక్రమాల్లో తిరిగిన నేను క్రమంగా పీడిత ప్రజల విముక్తి కోసం పాటలు రాయడానికి నా కుటుంబ నేపథ్యం, నేను అధ్యయనం చేసిన గ్రంథాలు, నా సహచర మిత్రులు, విద్యార్థి సమాఖ్య ఉద్యమాలు కారణమని వివరించారు. అఖిల భారత అభ్యుదయ రచయి తల సంఘం ఆవిర్భవించిన 1936 లో పుట్టానని, విద్యాభ్యాసం గుంటూరులో కొనసాగిందని వివరించారు. తను రచనా వ్యాసంగం 15వ ఏటా నుంచే ప్రారంభం కాగా, 1953 లో 'ఆంధ్ర శాసనసభ్యులు', 1956 లో 'ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యులు' గ్రంథాలు రచించానని తెలిపారు. . 'యువజన', 'అభ్యుదయ', 'వీచిక' పథకలకు సంపాదకుడిగా బాధ్యతలు నిర్వహించడం జరిగిందన్నారు. తన అయదారు గీతికా సంపుటులు వెలువరించడం జరగిందని, ఈ పాటల సమగ్ర సంపుటి 'జనం నుండి జనంలోకి' పేరుతో వెలువడి, హిందీ భాషలోకి అనువదించబడిందని తెలిపారు. అదేవిధంగా 'తాపి ధర్మారావు జీవితం-సాహిత్యం' అనే అంశపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పుచ్చుకోవడంతో పాటు 'కొంపెల్ల జనార్దనరావు రచనలు', 'తుమ్మల వెంకటరామయ్య సాహిత్యం', 'మాచిరాజు దేవిప్రసాద్ ప్యారడీలు', 'శిష్టా ఉమామహేశ్వరరావు సాహిత్య సర్వలభ్య సంపుటి', 'అభ్యుదయ' ప్రత్యేక సంచికలను ప్రకటించాని వివరించారు. . 'పోయట్లే వర్కషాప్' పేరుతో శతాధిక కవుల చేతిరాతల కవితల సంకలనాన్ని రూపొందించడం ప్రపంచ సాహిత్యంలో ఇదొక అరుదైన ప్రయోగమని చెప్పారు. అంతకుముందుగా కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ ఏటుకూరి ప్రసాద్ ను సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కవి, విమర్శకుడు, జర్నలిస్టు, పత్రికా సంపాదకుడు, వక్త ఉత్తమ అధ్యాపకుడిగా 'ఏటుకూరి' బహుముఖీన కృషిని విశేషించాడు. ఏటుకూరి ప్రసాద్ అసలు పేరు వైబిఎస్ ప్రసాదరావు అని కాగా, విశాలాంధ్ర దిన పత్రికకు సాంస్కృతిక రంగం జర్నలిస్టుల పని చేయడం, ఏటుకూరి బలరాంమూర్తికి దగ్గరి బందువు కావడంతో అయన పేరు కూడ ఏటుకూరి ప్రసాద్ మారిందని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్, సాహిత్య అకాడమి మాజీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి, ఇప్టా జాతీయ ఉపాధ్యక్షులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, నవ చేతన పబ్లిషింగ్ హౌస్ కార్యనిర్వాహక సంపాదకులు మధుకార్, నవ చేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బి.ఎస్.మోహన్ రెడ్డి, అధ్యాపక ఉద్యమ నాయకుడు మోటూకూరి నారాయణ రావు, సిపిఐ సీనియర్ నాయకురాలు డా. బి.వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాండేవో 2025 ఎ డే విత్ లీడర్స్ సమావేశాలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: మహిళా విద్య పట్ల నిబద్ధతకు పేరుగాంచిన . నారాయణమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్‌లోని స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ మేనేజ్‌మెంట్, విద్యాసంస్థలు, పరిశ్రమలను అనుసంధానించే లక్ష్యంతో ప్రతిష్టాత్మకమైన సమ్మిట్ రాండేవో 2025: ఎ డే విత్ లీడర్స్‌ను విజయవంతంగా నిర్వహించింది.

చైర్‌పర్సన్, వైస్-చైర్‌పర్సన్ జి. శ్రీవిద్య రెడ్డి డైనమిక్ నాయకత్వంలో, ఈ సమావేశంలో 20 మందికి పైగా ప్రముఖ లీడర్లు, పరిశ్రమ నిపుణులు సమావేశమయ్యారు. ఈ ప్రధాన కార్యక్రమం ఔత్సాహిక గ్రాడ్యుయేట్లకు అమూల్యమైన ముఖాముఖి పరస్పర చర్యలను, కార్పొరేట్ ప్రపంచం యొక్క అభివృద్ధి చెందుతున్న డిమాండ్లపై లోతైన అంతర్దృష్టులను అందించింది. ప్యానెల్ చర్చలలో, నాయకులు మానవ వనరుల ప్రపంచంపై అధునాతన సాంకేతికత ప్రభావం గురించి విద్యార్థులకు సలహా ఇచ్చారు. విశ్లేషణలు నియామకాలను ఆటోమేట్ చేయడం, ఉద్యోగుల నిశ్చితార్థాన్ని పెంచడం, నిర్ణయం తీసుకోవడాన్ని ఆప్టిమైజ్ చేయడం ద్వారా మారుస్తున్నాయి. -ఆధారిత సాధనాలు నియామకాన్ని క్రమబద్ధీకరిస్తాయి, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ నిలుపుదల వ్యూహాలను మెరుగుపరుస్తాయి. చాట్‌బాట్‌లు ఉద్యోగి అనుభవాన్ని మెరుగుపరుస్తాయి. మరింత డేటా-ఆధారితంగా మారుతున్నందున, భవిష్యత్ నిపుణులు సమర్థవంతమైన, సమగ్రమైన కార్యాలయాలను సృష్టించడానికి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు అనుగుణంగా ఉండాలి.అలాగే, సెమినార్ హైలైట్ చేసిన నాయకులు వైవిధ్యం, సమానత్వం, చేరిక, చెందినవి - సమగ్ర విద్యా, కార్యాలయ వాతావరణాలను రూపొందించడంలో సవాళ్లు నివారణలు యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. అపస్మారక పక్షపాతం, అసమాన అవకాశాలు, మార్పుకు ప్రతిఘటన వంటి సవాళ్లు వృద్ధికి ఆటంకం కలిగిస్తాయి. వీటిని పరిష్కరించడానికి, వారు న్యాయమైన నియామకం, సమగ్ర నాయకత్వం మరియు మార్గదర్శక కార్యక్రమాలను నొక్కి చెప్పారు. బహిరంగ సంభాషణను ప్రోత్సహించడం, గౌరవం, సంస్కృతిని పెంపొందించడం భవిష్యత్ నిపుణులు విభిన్నమైన అభివృద్ధి చెందుతున్న సంస్థలను నిర్మించడంలో సహాయపడుతుంది. చైర్‌పర్సన్, వైస్-చైర్‌పర్సన్, జి. శ్రీవిద్యా రెడ్డి మాట్లాడుతూ, రాండేవో 2025: అనేది విద్యారంగం, పరిశ్రమలను వారధి చేయడం, మా విద్యార్థులను జ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసంతో శక్తివంతం చేయడం ద్వారా నిరంతరం అభివృద్ధి చెందుతున్న కార్పొరేట్ ప్రపంచంలో రాణించడానికి మా నిబద్ధతకు నిదర్శనం. భవిష్యత్ నిపుణులను పరిశ్రమ నాయకులతో అనుసంధానించడం ద్వారా, ఆవిష్కరణ, చేరికతో నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్న మహిళల తరాన్ని మేము రూపొందిస్తున్నాము అని అన్నారు.

# నకిలీ రూ.500 నోట్లను తయారు చేసి మార్కెట్‌లోకి చేరవేస్తున్న నిందితుడిని అరెస్టు చేసిన సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః సునాయాసంగా డబ్బులను సంపాదించేందుకు ఏకంగా నకిలీ నోట్లను తయారుచేసి, మార్కెట్‌లోకి చేరవేస్తున్న ఓ పాత ఘరానా నిందితుడిని కమీషనర్స్ ఆఫ్ టాస్క్‌ఫోర్స్, సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సంఘటన నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుందని టాస్క్‌ఫోర్స్ డి.సి.పి. వై.వి.ఎస్.సుధీంధ్ర తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.....గుంటూరు ప్రాంతానికి చెందిన పబ్బతి మురళికృష్ణ కంప్యూటర్‌లో బాగా నాలెడ్జ్ ఉంది. ఇతనికి ప్రింటింగ్ కౌంటర్‌ఫెయిట్ కరెన్సీని మోసం చేయడంలో సిద్ధహస్తుడు. ఇతనివద్ద కంప్యూటర్ సిస్టమ్,స్కానర్,స్క్రీన్ ప్రింటింగ్ మిషన్,హీట్ మిషన్‌లు ఉండడంతో, నిందితుడు పేపర్ కరెన్సీ నోట్‌లను ఓరిజినల్ నోట్ల మాదిరిగా ముద్రించడంలో ఎంతో సిద్ధహస్తుడు. ఇతను అచ్చం అసలైన రూ.500 నోట్ మాదిరిగానే నకిలీ రూ.500 నోట్లను ప్రింట్‌చేసి, మార్కెట్‌లోకి చేరవేస్తుండేవాడు, అసలైన రూ.500ల నోట్లను రూ.14వేలు ఇస్తే,నకిలీ రూ.500 నోట్లను ఏకంగా లక్ష నకిలీ నోట్లను అందజేసేవాడు. ఇతనిమీద అంతకుముందే, వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నకిలీ నోట్లను అసలైన నోట్లుగా ప్రింట్‌చేసి,మార్కెట్‌లోకి చేరవేయడం కేసులు నిందితడుగా నమోదుఅయిన జైలుపాలు బెయిల్‌మీద వచ్చి,తిరిగి ఇదే వృత్తిని రహస్యంగా చేపడుతున్నట్లు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు విశ్వాసనీయమైన సమాచారం లభించడంతో, తమ పోలీసులు, నాంపల్లి పోలీసులుకల్సి నిందితుడు నాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో నకిలీ నోట్లను తెలిసిన వ్యక్తికి అందజేసేందుకు నిలబడగా,అక్కడేఉన్న తమ పోలీసులు అతన్ని పట్టుకుని, వానివద్దనుంచి రూ.11,10,500లు నకిలీ నోట్లు, నకిలీ నోట్లను తయారుచేసే సామాగ్రిని స్వాధీనం చేసుకుని, విచారణ నిమిత్తం నిందితున్ని నాంపల్లి పోలీసులకు అప్పగించినట్లు డి.సి.పి. తెలిపారు. ఈ దాడి కేసులో కమీషనర్స్ ఆఫ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, సెంట్రల్ జోన్ ఇన్‌స్పెక్టర్,ఎస్.ఐ.లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## మత్స్య మహిళా కార్మికుల సదస్సు విజయవంతం చేయాలి

శంషాబాద్, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 01) : ఫిబ్రవరి 8న జరిగే మత్స్య మహిళా జాతీయ సదస్సు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్కుడ గ్రామంలో మత్స్య మహిళ సొసైటీ ఆధ్వర్యంలో మత్స్య మహిళా జాతీయ సదస్సు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం జాతీయ నాయకుడు లెల్లెల బాలకృష్ణ రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నరసింహ ఈ కార్యక్రమానికి పాల్గొని ఆయన మాట్లాడుతూ... మత్స్య సంపద దేశానికి కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యం అందిస్తున్నది మత్స్యకారులు కోట్లాది ప్రజలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. పురుషులతో సమానంగా మహిళలు పనిచేస్తున్నారు చేపల ప్రాసెసింగ్ అందిస్తున్నారు కటింగ్ శుభ్రం చేయటం కొయ్య తలలు తొలచడం హోల్సేల్ రిటైల్ చేపల వ్యాపారం ప్రధానంగా చేపలు గంపల్లో నెత్తిన మోస్తూ వీధి వీధి తిరుగుతూ మరియు ఫుట్పాతులపై అమ్ముతూ అనేక ఈసటింపులకు వేధింపులకు గురవుతూ జీవిస్తున్నారు దేశవ్యాప్తంగా మత్స్య మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించడానికి మన తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో ఫిబ్రవరి 8న మత్స్య మహిళల జాతీయ సదస్సు ఫిబ్రవరి 9న మత్స్యకారుల జాతీయస్థాయి సమావేశం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నాము దేశంలోనే మొట్టమొదటిసారిగా రెండు రోజులపాటు 300 మంది మత్స్యకారుల మహిళలతో జరగబోతున్న ఈ సదస్సును విజయవంతం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో నర్కుడ గ్రామ మధ్య సొసైటీ కార్యదర్శి నీరటి మల్లేష్ మత్స్య మహిళా సొసైటీ రాష్ట్ర నాయకురాలు నీరటి అనురాధ మరియు మత్స్య మహిళ సొసైటీ లా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు

★ పిఏసిఎస్ చైర్మెన్ వెదిరె హన్మంత్ రెడ్డి

★ రేపటి నుండి గ్రామాల్లో రీసర్వే : ఎంపిడివో బాలశంకర్



మంచాల, మేజర్ న్యూస్ (పిబ్రవరి 01) : అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాలని పిఏసిఎస్ చైర్మెన్ వెదిరె హన్మంత్ రెడ్డి, ఎంపిడివో బాలశంకర్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆరు గ్యారంటీల అమలుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేపు సోమవారం నుండి పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మొదలగు సంక్షేమ పథకాల అర్హులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేయడంలో ఇండ్లు లేకుండా అద్దె ఇంట్లో ఉన్నవారికి, గుడిసెలో, పెంకుటిల్లు, రేకుల ఇళ్లలో ఉన్న వారికి మొదటి ప్రాదాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కావున ప్రజలు కూడా అధికారులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సరైనా సమాచారం ఇచ్చి సహకరించాలనికోరారు. ఈ సమావేశంలో ఎంపివో ఉమారాణి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బిల్ కలెక్టర్‌ను సన్మానించిన షేక్ అఫ్జల్



జల్ పల్లి, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 01):ఇటీవలే కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ బిఎల్ఓ గా అవార్డు అందుకున్న జల్ పల్లి మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ నరేందర్ ను శనివారం మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్ కలిసి అభినందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా షేక్ అఫ్జల్ మాట్లాడుతూ. మున్సిపాలిటీలో పని చేసే అధికారులు విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలని, అందుకు బిల్ కలెక్టర్ నరేందర్ ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

## మధ్యతరగతి, ఉద్యోగుల కు కేంద్ర బడ్జెట్ పెద్దపీట

★బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు సాధ మల్లారెడ్డి



కందుకూరు, మేజర్ న్యూస్ ( ఫిబ్రవరి 01): మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలు, బలహీన వర్గాలు, మహిళలకు పెద్ద పీట వేస్తు అన్నీ వర్గాలను ఊరట కలిగించే కేంద్ర బడ్జెట్ ఉందని మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు సాధ మల్లారెడ్డి అన్నారు. శనివారం ఆయన పత్రికటనలో తెలుపుతూ...నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌దేశంలోని అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ఉందని మల్లారెడ్డి అన్నారు.ఈ రోజు కేంద్రంలోని నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్డీయ ప్రభుత్వం ఆర్థిక మంత్రి వర్యులు శ్రీమతి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపులు జరిగాయన్నారు.అలగే పన్నుల శ్లాబ్స్ మినహాయింపులు , వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించి ప్రజలకూ ఉపయోగ పడే విధంగా కేటాయింపు ఉన్నాయని ఆయన అన్నారు.

## ఘనంగా ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు జయేందర్ జన్మదిన వేడుకలు



కందుకూరు, మేజర్ న్యూస్ (ఫిబ్రవరి 01) ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు కుర్నమోని జయేందర్ ముదిరాజ్ జన్మదిన వేడుకల సందర్భంగా శనివారం ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సురేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు పిట్టల పాండు ముదిరాజ్ పాల్గొని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, జయమ్మ జంగయ్య ముదిరాజ్, కార్యదర్శి ఎరగమోని నరసింహా ముదిరాజ్, యువత మండల ఉపాధ్యక్షుడు నరేందర్ ముదిరాజ్, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అరుల్హకే సంక్షేమ పథకాలు అమలు

★ కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షుడు వింజమూరి రాంరెడ్డి

★ రేపటి నుండి గ్రామాల్లో సర్వే ★ పార్టీ శ్రేణులు సర్వేకు సహకరించాలని



మంచాల మేజర్ న్యూస్ (పిబ్రవరి 01) : నిజమైన అర్హులకే సంక్షేమ పథకాలు ఇవ్వడం జరుగుతుందని ఎవరూ కూడా ఆందోళన చెంద వద్దని కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షుడు వింజమూరి రాంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రేపటి నుండి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడం కోసం గ్రామాల్లో సర్వే చేయడం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు కూడా సర్వే చేస్తున్న వారికి సహకరించాలని ఆయన కోరారు. సర్వేలో ఎలాంటి పక్షపాతం లేకుండా అర్హులను గుర్తించడంలో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మెన్ హన్మంత్ రెడ్డి, డైరెక్టర్ జెనిగె వెంకటేష్, మాజీ ఎంపిటిసి ఎద్మ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.